www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 29 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 241 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH










# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

- రాష్ట్రంలో టెంపుల్, హెల్త్, ఎకో టూరిజాలను తీసుకొస్తాం
- టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం వహించారు
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలే ప్రోత్సహిస్తాం
- ఇది సినిమా షూటింగ్‌లకు అద్భుతమని చెప్పిన నటుడు చిరంజీవి
- ఎక్స్ పీరియం పార్కు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**శంకర్ పల్లి వెలుతురు జనవరి 28**



తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే టెంపుల్, హెల్త్, ఎకో టూరిజం పాలసీలను తీసుకొస్తుందని, అయితే అంతకంటే ముందు ఎక్స్ పీరియం చైర్మన్ రామ్ దేవ్ రావు ఒక అడుగు ముందుకు వేసి 150 ఎకరాల్లో అద్భుతమైన ఎకో ఫ్రెండ్లీ పార్కును సృష్టించారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. దీనివల్ల రాష్ట్రానికి గుర్తింపు, గౌరవం, ఆదాయం వస్తుందని, ఆయన కృషిని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎకో ఫ్రెండ్లీ, 25 వేలకు పైగా జాతుల మొక్కలు, వైవిధ్యమున్న శిలలు, శిల్పాలు కలిగిన రంగారెడ్డి జిల్లా, ప్రొద్దుటూరులో 150 ఎకరాల్లో 2 లో..

# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

- తెలంగాణకు భారీగా పెట్టుబడులు రాక
- దావోస్ ఒప్పందాలతో రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు
- స్కిల్ వర్సిటీ కోసం సింగపూర్‌తో ఒప్పందం
- పెట్టుబడులపై కొందరు వక్రభాష్యాలు
- రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారాలు చేస్తున్నారు
- మంత్రులతో కలసి మీడియా సమావేశంలో సిఎం రేంవత్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి28( వెలుతురు):** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని 2 లో..

## రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు. ఉత్తమ్ లతో భేటీ అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 28:** దావోస్ పర్యటనలో తెలంగాణ రాష్ట్రానికి రూ. 1.73 లక్షల కోట్ల రూపాయిల పెట్టుబడులు సాధించడంలో ప్రముఖ పాత్ర వహించిన రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం నాడు శాలువాతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్మానించారు. అలాగే మంత్రి 2 లో..

## కార్పోరేటర్లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- మరోమారు మేయర్కావాలని కోరుకోవడం లేదు
- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టీకరణ

**హైదరాబాద్,జనవరి28( వెలుతురు):**



ఇది ఎలక్షన్ ఇయర్.. అభివృద్ధిపై కార్పొరేటర్లు దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గొడవలు చేసేందుకు కౌన్సిల్ వేదిక కాదని చెప్పారు. మళ్లీ కార్పొరేటర్‌గా తాను పోటీ చేయనని అన్నారు. మళ్లీ 6 లో..

# హైదరాబాద్‌లో మరో రెండు ఐటి పార్కులు

- హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేసే లక్ష్యం
- వందకోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ
- ప్రతినిధులతో చర్చించిన ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జనవరి28( వెలుతురు):** నగర శివారుల్లో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. హైదరాబాద్ లో రూ.100కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 2 లో..



## అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ

- కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం
- ఎన్నికల ప్రచారంలో విరుచుకుపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ,జనవరి28( వెలుతురు):** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీలోని ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అధికారంలోని ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ 2 లో..

# ప్రారంభమైన నాగోబా జాతర...

- ఫిబ్రవరి 4 వరకు వేడుకలు
- 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాల ఏర్పాటు



**ఆదిలాబాద్,జనవరి28( వెలుతురు):** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, 3 లో..

# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ

- జిల్లాలో వరి ఉత్పత్తిని పెంచేలా చేసిన కెసిఆర్
- రైతుబంధు ఉంటే కెసిఆర్‌ను గుర్తుంచుకుంటారన్న కుళ్లు
- రైతుభరోసా పేరుతో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోంది
- ఇచ్చిన హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి
- నల్లగొండలో ఇదో విజయోత్సవ సభలా ఉంది
- నల్లగొండ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు

**నల్గొండ,జనవరి28( వెలుతురు):** ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్



కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 2 లో..

# ఇంత క్రూరంగా కూడా చంపుతారా ?

- వెంకటమాధవి హత్య కేసులో నివ్వెరపోయే నిజాలు
- గురుమూర్తిని అరెస్ట్ చేసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



**హైదరాబాద్,జనవరి28 ( వెలుతురు):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసు వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. వెంకట మాధవి హత్య కేసు దర్యాప్తులో ఆధారాలు సేకరించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. 'ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా?'



3 లో..

# జూన్‌లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

- పార్టీకోసం కష్టపడ్డ వారికే పదవులు
- పదవులు పొందిన వారి పనితీరు పరిశీలన
- క్షేత్రస్థాయిలో పనిచేసిన వారినే ప్రోత్సహించాలి
- పార్టీ నేతలతో టెలి కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు స్పష్టీకరణ

**అమరావతి,జనవరి28( వెలుతురు):** జూన్ లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికంటే.. ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని తేల్చి చెప్పారు. 214



మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులు ఉన్నాయని, రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 8 లో..

## ప్రతి శనివారం ఇక నో బ్యాగ్ డే

- విద్యార్థులకు భారం తగ్గించేలా చర్యలు
- 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో సమీక్ష
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి



2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అయితే కొందరు దీనిని జీర్ణించుకోలేక వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారని సిఎం మండిపడ్డారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం ర ఏవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది మా ప్రభుత్వం సాధించిన కీలక విజయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. దావోస్ పర్యటనతో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టేలా మన రాష్ట్రం ఆకర్షించగలిగిందని చెప్పుకొచ్చారు. ఇది నిరంతర పక్రియ అని చెప్పారు. రాజకీయంగా విభేదించినా రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయ వివాదాలకు వెళ్లొద్దని హితవు పలికారు. పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు చేసి అన్ని రకాలుగా ఆ సంస్థలను ప్రోత్సహిస్తామన్నారు. మనందరం కలిసి కష్టపడితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. సింగపూర్ ఆధ్వర్యంలో నడుస్తుస్తున్న ఐటీఈ సంస్థతో కూడా ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఇది భవిష్యత్‌లో మన సాంకేతికను పెంపొందించ డానికి ఉపయోగపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకుని రావాలనేది మా ప్రయత్నం అని అన్నారు వాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు నిధులు తరలించారు. ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు. మేం విఫలమైతే పైశాచిక ఆనందం పొందాలని కొందరు చూశారు. ఇతర రాష్ట్రాలకంటే గొప్పగా పెట్టుబడులు సాధించాం. అసూయతోనే మమ్మల్ని వారు అభినందించడం లేదు. భారీ పెట్టుబడులు తేవడం చూసి కొందరికి కడుపుమంటగా ఉందని పరోక్షంగా బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్షంలో ఓ నేత అటెన్షన్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. చాలా సంస్థలు మన పెవిలియన్‌కు వచ్చి ఒప్పందాలు చేసుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈస్థాయిలో పెట్టుబడులు రాలేదనే అక్కసుతో ఉన్నారు. ఎనర్జీ పాలసీతోనే తెలంగాణలో పెట్టుబడులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు దావోస్ వెళ్లాం. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబుడులపై ఒప్పందాలు చేసుకున్నాం. తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో గతేడాది కంటే నాలుగు రెట్లు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రజలు, యువతకు మేలు చేయాలనేదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఎన్ని విమర్శలు చేసినా సలహా లాగే తీసుకున్నామన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని అన్నారు. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీవాక్ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. దావోస్ పర్యటనలో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని ఉద్ఘాటించారు. వన్ ట్రిలియన్ ఎకానమీ దిశగా అడుగుపడిందని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, యువతకు ఉపాధిపై దృష్టిపెట్టామని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందిస్తామన్నారు. హైదరాబాద్ అంటేనే .. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం అని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి తదితరులు కూడా పాల్గొన్నారు.


## రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు. ఉత్తమ్ లతో భేటీ అయిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఐటీ శాఖ బలోపేతం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే మంగళ వారం నాడు మరో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు, అయితే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇరువురు మంత్రులతో భేటీ అయి ఆయా అంశాలపై చర్చలు జరిపి అ శాఖ అభివృద్ధి పనులను గూర్చి మాట్లాడారు,

## హైదరాబాద్‌లో మరో రెండు ఐటి పార్కులు

'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. . వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి? నగర శివారుల్లో ఏయే ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఐటీ పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎక్కడి నుంచైనా ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ పార్కుల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సాఫ్ట్ వేర్ కంపెనీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ ఏదీ లేదని, దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ప్రత్యేక పాలసీ రూపొందిం చాలని నిర్ణయించామని, పెట్టుబడితో పాటు కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తా మని శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో 100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్ వేర్ కంపెనీని సంతోషంగా ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. రాబోయే అయిదేళ్లలో ఈ సంస్థ 900 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుందని పేర్కొన్నారు.

## అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ



కొట్టించారని, కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం ఉంటున్నారని, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్'కేజీవ్రాల్ తనకు తోచిన విషయాన్ని మాట్లాడుతూ ఉంటారు. మొదట్లో దిల్లీలో అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పారు. దేశ రాజధానిలో మార్పులు చూపిస్తానని అన్నారు. కానీ, పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం కనిపించకుండా పోతారు. దిల్లీలో హింస జరిగే సమయంలో మాయం అయ్యారు. ఆయనకు కొత్తలో చిన్న కారు మాత్రమే ఉండేది. కానీ, తర్వాత శీష్ మహల్‌లో (అద్దాల మేడ) నివసించారు' అంటూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. 'అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పి.. దిల్లీలో భారీ కుంభకోణమే చేశారు. కుంభకోణానికి కేజీవ్రాల్ రూపకల్పన చేశారు. కాబట్టి వాస్తవం బయటకి వచ్చింది. ఆప్ నేత మనీశ్ సిసోదియా జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం తమ పదవుల నుంచి తప్పుకున్నారు. పదవిలో ఉన్నప్పుడు ఆయన నివసించిన శీష్ మహల్‌ను మీరూ చూశారు. కేజీవ్రాల్ అత్యంత విలాసవంతమైన అద్దాల మేడలో నివాసం ఉన్నారు. ఇప్పుడు నిజాలు బయటపడ్డాయి. వారి రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి' అని అన్నారు. దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అధికారంలోని ఆప్‌ను గద్దె దింపేందుకు ప్రతిపక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొంతకాలంగా 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా విమర్శిస్తోంది. ఈ క్రమంలోనే శీష్ మహల్ గురించి ప్రస్తావిస్తూ రాహుల్ ఆప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. దిల్లీలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

ఉన్న ఎక్స్ పీరియంను నేడు తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి, పర్యాటక శాఖామాత్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు, ఎక్స్ పీరియం చైర్మన్ శ్రీ రామడుగు రామ్ దేవ్ రావు, పద్మశ్రీ వనజీవి రామయ్య, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్, సిఎం రమేశ్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మల్ రెడ్డి రంగారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, 70 ఎకరాల అడవిని సృష్టించిన దుశర్ల సత్యనారాయణ, రైటర్ విజయేంద్ర ప్రసాద్, ప్రముఖులు, తదితరులు కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐటి, ఫార్మా రంగాలలో రాణించిందని, మౌలిక సదుపాయాలలో దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయన్నారు.

అయితే తెలంగాణలో టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం, ఎకో టూరిజం రావాలన్నారు. వీటివల్ల రాష్ట్రానికి గుర్తింపు, గౌరవం, ఆదాయం లభిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే టూరిజం పాలసీపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారి నేతృత్వంలో చర్చిస్తోందని, త్వరలో విధివిధానాలు తీసుకొస్తుందని వెల్లడించారు.

ప్రస్తుతం శుభకార్యక్రమాలు చేయాలంటే ఇతర దేశాలు, ప్రాంతాలకు వెళ్లి చేసుకుంటున్నారని, మందిరాలు దర్శించాలంటే తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని, ఫారెస్ట్, ప్రకృతిని చూడాలంటే మధ్యప్రదేశ్ కు వెళు _న్నారన్నారు. టూరిజం పాలసీ వల్ల భవిష్యత్తులో ఇవన్నీ ఇక్కడే చేసుకోవచ్చన్నారు. ప్రముఖులు ఇళ్లు కట్టుకుంటే గోదావరి జిల్లాల నుంచి మొక్కలు తెప్పించుకునే పరిస్థితి నుంచి నేడు ఎక్స్ పీరియం నుంచి మొక్కలు తెచ్చుకునేటట్లు చేశారన్నారు. తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మందిరాలు, ప్రకృతి వనరులున్నాయన్నారు. నల్లమల్ల టైగర్ ఫారెస్ట్, కృష్ణానది జలాలు పారిస్తున్న ప్రాంతం, మల్లెల తీర్థం వంటివి ఉన్నాయన్నారు. వీటికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల ఎకో టూరిజం వెనుకబడుతుందని చెప్పారు.

ప్రస్తుతం ఎక్స్ పీరియంలో జరిగిన అభివృద్ధి 30 శాతమేనని, రానున్న ఏడాదిలో ఇదొక అద్భుతమైన పర్యాటక ప్రదేశంగా మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

వికారాబాద్ కా హవా లాకోం రూపాయి కా దవా అని మా ఎమ్మెల్యే యాదయ్య అంటంటారని చమత్కరించారు.

వికారాబాద్ లో సాధారణంగా చుట్టుపక్కల ప్రాంతాల కంటే 2 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందన్నారు. అందుకే ఇక్కడ టీబీ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడకు టీబీ ఉన్నవారిని తీసుకొస్తే ఇక్కడి వాతావరణం, ప్రకృతి సహజ వనరుల వల్లే వారికి జబ్బు తగ్గుతుందన్నారు.

త్వరలోనే పెద్ద, పెద్ద పరిశ్రమల వాళ్లు ఇక్కడకు వచ్చి, వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. అయితే వీరికంటే రామ్ దేవ్ రావు గారు ఒక అడుగు ముందుకేశారన్నారు. భవిష్యత్తు ఎకో టూరిజానికి ఎక్స్ పీరియం ఒక ప్రాతిపదిక అవుతుందన్నారు. దీనికి ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు.

ఈ ఎక్స్ పీరియం కేవలం ఒక వ్యాపార కేంద్రంగానే కాకుండా పర్యాటక క్షేత్రంగా అవతరిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. రాష్ట్రం ఆలోచనకు అనుగుణంగా ఈ పార్కు ఉందని చెప్పారు. ఎకో టూరిజంలో ఎలాంటి పార్కులు డెవలప్ చేయాలనుకుంటున్నామో ఇది అలాగే ఉందన్నారు.

మన రైతులు కేవలం వరి పండిచడమే కాదు.. ఇలాంటి మొక్కలు కూడా పెంచేలా చేయాలనుకుంటున్నామని తెలిపారు. రైతులు పెంచే మొక్కలు జనాలు కొనుగోలు చేసేలా చేస్తున్నామన్నారు. మొక్కలు పెంచడానికి క్షేత్రాలు ఇస్తున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం రైతులు కేవలం ఆరు నెలలే మొక్కలు పెంచడం వల్ల అవి 20 నుంచి 30 శాతానికి మించి బతకడం లేదన్నారు. 2,3 సంవత్సరాలు నిండే వరకు మొక్కలు పెంచితే, వాటిని తీసుకెళ్లి నాటితే ఎక్కువగా బతుకుతాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఇలాంటి మొక్కలను ఒక్క సీజన్ కాపాడితే సరిపోతుందన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు నేను ఆదేశాలు ఇస్తానని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విధి విధానాలు చర్చించి, సవరించి ప్రకృతి పరిరక్షణ కోసం పాటుపడుతామని హామీ ఇచ్చారు.

వనజీవి రామయ్య గారికి భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చిందన్నారు. మొక్కలు నాటడంలో రాణించినందుకు ఆయనకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. రామయ్య లాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

తల్లి పేరుమీద విద్యార్థులు ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలనే విధానాన్ని తీసుకొస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల రాష్ట్రంలో కొన్ని కొట్లాది మొక్కలను పెంచవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

త్వరలోనే దీనిపై విధివిధానాలు తీసుకొస్తామని వెల్లడించారు.

ఈరోజు ప్రారంభించిన ఎక్స్ పీరియంను గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు మాట్లాడారు. ఆయన మాటలు...

గడచిన 25 ఏళ్ల నుంచి ఒక కల కని సుదీర్ఘంగా తపన పడుతూ దీనిని రామ్ దేవ్ రావు నిజం చేశారు. గ్రేట్ ఎక్స్ పీరియన్స్ ఈ ఎక్స్ పీరియం. దేశానికే కాదు.. ప్రపంచానికి తలమానికం ఈ ఎక్స్ పీరియం.

హైదరాబాద్ అంటే ఆకాశహార్మ్యాలు, గుడులు, చెరువులతో పాటు ఎక్స్ పీరియం కూడా వచ్చింది.

తెలంగాణకు ఇది మణిహారం. హైదరాబాద్ లో గోల్కొండ, చార్మినార్ సరసన ఎక్స్ పీరియం చేరింది. లైఫ్ చాలా చిన్నది..విలువైంది. ఇలాంటి ప్రకృతి అందాలు అందరూ చూడాలి.

అమెరికాలో వారానికి 2 రోజులు ఆటవిడుపు గడుపుతారు. కనీసం సంవత్సరానికి మనం 10,15 రోజులు గడపాలి. దీనివల్ల మన ఆలోచన విధానం మారుతుంది. ఆహ్లాదం కలుగుతుంది. యావత్తు రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని కూడా చూడాలి.

ఇంత గొప్ప నిర్మాణాన్ని చేపట్టిన రామ్ దేవ్ గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి గారి మాట్లాడారు. ఆయన మాటలు .....

ఈ ప్లేస్ మీ అందరికంటే ముందు నాకు తెలుసు. ఇది ప్రారంభించినప్పుడు పాంప్లెట్ వేసి, కొన్ని మొక్కలు మా ఇంటికి తీసుకొచ్చారు రామ్ దేవ్ రావు. ఇలాంటి సజీవ మొక్కలు చూస్తే ఎంతో టెమ్ట్ అయ్యాను. విదేశాల్లో దొరికే ఇలాంటి మొక్కలు హైదరాబాద్ లో ఇప్పుడు దొరకడం ఎంతో సంతోషం.

మా ఇంటి ముందు మొక్కలతో రామ్ దేవ్ రావు వేసిన ఫెన్సింగ్ గొప్ప కళాఖండం. రామ్ దేవ్ రావు వ్యాపారవేత్త కాదు. కళాకారుడు. అందుకే నా మనస్సుకు దగ్గరయ్యాడు. పార్కులో మొక్కలను వీక్షిస్తుంటే చాలా టెమ్ట్ గా ఉంది. దీనికి కళాహృదయం ఉండాలి. అలా లేకపోతే 25 ఏళ్ల ఈ ఎక్స్ పర్మెంట్ చేయలేదు. ఈ పార్కు ఏర్పాటు దుర్భేద్యం కాదు సాధ్యమే అని నిరూపించారు రామ్ దేవ్ రావు. ఆయన పడిన కష్టం, శ్రమ ఇన్ని ఎకరాల్లో కనిపిస్తుంది. ఇన్ని ఎకరాలు, డబ్బులు ఉంటే మల్టీ స్టోరేడ్ భవనాలు కట్టుకుంటే తరతరాలు నిలిచిపోతుంది. కానీ ఆయన మదిలో ఉన్న ఈ బ్రెయిన్ చైల్డ్ ను చూసి నేడు ముఖ్యమంత్రి ముచ్చట పడిపోతున్నారు.

దీనిని ఫిల్మ్ షూటింగులకు ఇస్తారా అని నేను అడిగితే... ఫస్ట్ షూటింగ్ కు ఇస్తే మీకే ఇస్తానని రామ్ దేవ్ రావు గారు నాకు చెప్పారు. కానీ నేను ఇప్పటికిప్పుడు ఇక్కడ హీరోయిన్ తో స్టెప్పులు వేయలేను. త్వరలో కచ్చితంగా చేస్తాను. 1,2 ఏళ్లలో అద్భుతంగా తయారవుతుంది. ఇక్కడ వెడ్డింగ్ ప్లాన్ చేసుకోవచ్చు.

ఇంకా ఇక్కడ ఐస్ స్కేటింగ్ చేయాలని ఉందని రామ్ దేవ్ రావు చెప్పారు. ఇంకా ఎన్నో చేయాలని ఉందని చెప్పారు. అవన్నీ సాధ్యం చేయగలరు రామ్ దేవ్ రావు.

సిఎంగారు ఎంతో బిజీగా ఉన్నా వాటిని పక్కన పెట్టి దీనిని ఎంకరేజ్ చేసి, ప్రారంభించారు. దీనికి సిఎంగారికి నా తరపున ధన్యవాదాలు. సిఎం లాంటివాళ్లు వస్తేనే ఈ ప్రాంతం అందరి కళ్లలో పడుతుంది. పర్యాటక ప్రాంతం కావాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు వచ్చారు. ఇదొక అద్భుత కళాఖండం అవుతుంది. బ్యూటిఫుల్ పీస్ ఆఫ్ ఆర్ట్ ఇది. ఇంత మంచి పార్క్ క్రియేట్ చేసినందుకు ధన్యవాదాలు, అభినందనలు.

ఈ ప్రారంభోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడారు. ఆయన మాటలు...

రామ్ దేవ్ గారు భారతదేశంలో ఈ ప్రాంతాన్ని నెంబర్ 1 చేస్తున్నందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు. 85 దేశాల నుంచి మొక్కలు తెచ్చి ఆహ్లాదకరంగా చేస్తున్నందుకు కృతజ్ఞతలు. ఇప్పుడు విదేశాల నుంచి అనేక మంది ఇక్కడకు రానున్నారు. లండన్ కాదు, ప్యారిస్ కాదు మన హైదరాబాద్ కు వన్నె తెచ్చినందుకు, ఆయనకు మరింత శక్తినివ్వాలని భగవంతుని కోరుకుంటున్నాను.

ఈ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు చేయాలని సిఎం గారిని కోరుతున్నాను. రాబోయే కాలంలో చాలామంది ఇక్కడకు వచ్చే అవకాశం ఉన్నందున ఈ రోడ్డును విస్తరించాలని విజ్ఞప్తి.

ఎక్స్ పీరియం చైర్మన్ రామ్ దేవ్ రావు స్వాగతోపన్యాసం చేశారు. ఆయన మాటలు....

సిఎం రేవంత్ రెడ్డి గారు వచ్చి గార్డెన్ చూడడం కలలో కూడా ఊహించినది. దీనికి ఎంతో, ఎంతో రుణపడి ఉంటాను. మంత్రి జూపల్లి గారు, మెగాస్టార్ గారు, నాయకులు, పెద్దలు రావడం చాలా ఆనందంగా ఉంది. సిఎం గారు నాతో కలిసి ఈ పార్కులో నడవడం చాలా సంతోషంగా ఉంది.

ప్రారంభోత్సవం సందర్భంగా ఎక్స్ పీరియం చైర్మన్ రామడుగు రామ్ దేవ్ రావు.... పార్కు ప్రారంభకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులందరికి పార్కు చూపించి, దాని విశిష్టతలు, ప్రత్యేకతలు వివరించారు. అనంతరం ఆసియాలోనే అతిపెద్ద హంపి థియేటర్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఎక్స్ పీరియం గురించి సోషల్ పోస్ట్ డిజిటల్ మీడియా రూపొందించిన ఆడియో-విజువల్(ఏవి)ను సిఎం రేవంత్ రెడ్డి గారు లాంచ్ చేశారు. అనంతరం పద్మశ్రీ వనజీవి రామయ్య, గ్రీన్ హార్ట్ ఆఫ్ ఇండియా దుశర్ల సత్యనారాయణలను సిఎం రేవంత్ రెడ్డి గారు, అతిథులు కలిసి సన్మానించారు.

ఎక్స్ పీరియం చైర్మన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి గారిని సన్మానించారు. అనంతరం ఎక్స్ పీరియం లోగో, కాఫీ టేబుల్ బుక్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అతిథులందరు కలిసి ఆవిష్కరించారు.

# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..' రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బందైతది' అని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె అని అన్నారు. రైతుభరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి. రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యిందన్నారు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలేదన్నారు. ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలేదన్నారు. 'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ.. నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసిండ్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా అంటూ కెటిఆర్ ఎద్దేవా చేశారు. జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతాయని చెప్పాడని, కానీ ఇంతవరకు రైతు భరోసా డబ్బులు రాలేదని ఆయన ఆరోపించారు. నల్లగొండ బిడ్డలు జీవచ్ఛవాలుగా మారడానికి కారణమే కాంగ్రెస్. నల్లగొండ రైతుల అవస్థకు కారణమే కాంగ్రెస్. మిమ్మల్ని మోసం చేయడానికే కాంగ్రెస్ నేతలు కొత్త వేషాలు వేసుకుని ఎన్నికలకు వచ్చిండ్రు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిండ్రు' అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ లో విద్యార్థులు గొడ్డు కారంతో అన్నం తినాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఐటీ టవర్ కళ తప్పిందని విమర్శించారు. తన రాక సందర్భంగా నల్లగొండ ప్రజల ఆదరణ చూస్తుంటే.. తాను రైతు ధర్నాకు వచ్చినట్లు లేదని, విజయోత్సవ ర్యాలీకి వచ్చినట్లు ఉందని అన్నారు. వెంకట్‌రెడ్డి వచ్చినంక అండ్ల ఎవలన్న ఉన్నరో.. లేకుంటే తాగుబోతుల అడ్డా అయిందోగానీ, మొత్తానికైతే ఐటీ టవర్ కళ తప్పింది' అన్నారు. ఒక విజయోత్సవ ఊరేగింపు జరిగినట్లుగా ఉంది. భారీగా ధర్నాకు తరలివచ్చిన నల్లగొండ రైతు బిడ్డలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని కేటీఆర్ చెప్పారు.

## ప్రతి శనివారం ఇక నో బ్యాగ్ డే



**అమరావతి,జనవరి28( వెలుతురు):** త్వరలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' అమలు చేయబోతున్నట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దీనికి సంబంధించి విద్యార్థులకు యాక్టివిటీస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో గత వైకాపా ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 117 ఉపసంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలన్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. త్వరలోనే చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీ చట్టంపై సమావేశంలో చర్చించారు. ఈ అంశంపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. సాంకేతికత సాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకటే యాప్‌ను రూపొందించే పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధరించేందుకు అపార్ ఐడీ అనుసంధానంపై ఆరా తీశారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో చేపట్టబోయే సంస్కరణలపైనా సమావేశంలో చర్చించారు.





## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ లు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి28:** మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో గల ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని మంగళ వారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సెంట్రల్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు ,రాష్ట్ర ఎంపి బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు సంతోషంగా ఉండాలని కోరినట్లుగా తెలిపారు, తెలంగాణ రాష్ట్రం లో అభివృద్ధి పనులు చేస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని పేర్కొన్నారు, తెలంగాణ రాష్ట్రంపై ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా కోరినట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## ప్రారంభమైన నాగోబా జాతర...



ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు. అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

### నాగోబా జాతర సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు



ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణ సాంస్కృతిక వైభవమని పేర్కొన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక "నాగోబా జాతర" సందర్భంగా ముఖ్యమంత్రి గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం ప్రారంభంకానుంది. గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన నాగోబా జాతరను ఆదివాసీ, గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. ఈ జాతరకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలను పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో ప్రభుత్వం సుమారు 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది.ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా గిరిజనుల ఇలవేల్పు నాగోబా మహాపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం మెస్రం వంశీయులు నెల రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేపడతారు. కాలినడకన సుమారు 250 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తీసుకువచ్చిన పవిత్ర గోదావరి జలాలలో నాగోబాకు అభిషేకం, మహాపూజ చేయడంతో ఈ ఇక్కడ జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. ఇప్పటికే నాగోబా అభిషేకానికి కావాల్సిన పవిత్ర గంగా జలాలను తీసుకొని కేస్లాపూర్ కు వచ్చిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని మర్రి చెట్టు వద్ద విడిది చేసి ఉన్నారు. మంగళవారం రాత్రి అక్కడి నుండి గిరిజన సంప్రదాయ దుస్తుల్లో వాయిద్యాలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం మెస్రం వంశీయులు, కట్టోడాలు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో తయారు చేయించిన కుండలను మాత్రమే గిరిజనులు ఇక్కడ పూజలకు వినియోగించడం ఆనవాయితీగా వస్తుంది.

# ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష

- **అందోల్ ట్యాంక్ బండ్ ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి**
- **ఆందోల్ చెరువు లో పర్యాటకుల కోసం బోటింగ్ సౌకర్యం కల్పించాలి**
- **పట్టణంలో గాంధీ పార్క్ ను అభివృద్ధి చేయాలి**
- **ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి**
- **అధికారుల సమీక్షలో మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశ నిర్దేశం**



**ఆందోల్ - జోగిపేట వెలుతురు జనవరి 28:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.
ఈ సమీక్షలో ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా ఆందోల్ పట్టణానికి తలమానికంగా నిలిచిన ట్యాంక్ బండ్ ను పర్యాటకుల కోసం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఆందోల్ ట్యాంక్ బండ్ లో పర్యాటకుల కోసం బోటింగ్ సౌకర్యం, రెస్టారెంట్ ఏర్పాటు, ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం పై చర్చించారు.
ఈ సమీక్షలో పట్టణంలో నిర్మిస్తున్న ఆధునిక లైబ్రరీ, మున్సిపల్ ఆఫీస్ పనుల పురోగతిపై చర్చించారు. ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ ఉన్నా గాంధీ పార్క్ ఆధునీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అలాగే పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియం లో వాలీబాల్, ఫుట్ బాల్, క్రికెట్ గ్రౌండ్ లలో మౌలిక సదుపాయాల కల్పన తో పాటు మల్టీ పర్పస్ స్టేజ్ ను నిర్మించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
ఈ సమీక్షలో ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (TUFIDC) 30 కోట్ల 20 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్న 34 పనుల పురోగతి పై ప్రజారోగ్య శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ చర్చించారు. మున్సిపాలిటీ లో చేపడుతున్నా పనులను వెంటనే పూర్తి చేయాలనీ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.
ఈ పర్యటనలో ఆందోల్ లో నిర్మించనున్న ప్రతిపాదిత ఏం. ఫార్మసీ కళాశాల, ఇతర విద్యాసంస్థల ఏర్పాటు కు స్థల పరిశీలన ను స్థానిక ఆర్డిఓ, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఏర్పాటుకు అవసరమైన ల్యాండ్ బ్యాంకును సమకూర్చాలని మంత్రి రెవిన్యూ అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో ఆందోల్ డివిజన్ ఆర్డిఓ పాండు నాయక్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి కుమార్, ఆందోల్ - జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు మంత్రి వెంట పాల్గొన్నారు.

# వన్యప్రాణుల దత్తత ప్రక్రియ ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**హనుమకొండ లోని కాకతీయ జూలాజికల్ పార్కులోని నీల్గాయి, సాంబార్ డీర్, చౌసింగా, అడవి దున్నలను దత్తత తీసుకున్న మంత్రి సురేఖ**









( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 28:** అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ హన్మకొండ కాకతీయ జూలాజికల్ పార్క్ లోని నీల్గాయ్, సాంబార్ డీర్, చౌసింగా, అడవి దున్నలను ఒక్కోటి చొప్పున నేడు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు కాకతీయ జూ పార్క్ అసిస్టెంట్ క్యురేటర్ మయూరి హన్మకొండ రాంనగర్ లోని మంత్రి కొండా సురేఖ నివాసానికి వచ్చి వన్యప్రాణల దత్తత ప్రక్రియను పూర్తి చేశారు. సంవత్సర కాలానికి ఒక్కో వన్యప్రాణికి ఆహారం, సంరక్షణ కోసం రూ. 50 వేల చొప్పున మొత్తం నాలుగు వన్యప్రాణులకు కలిపి రూ. 2 లక్షలను మంత్రి సురేఖ ఆన్లైన్ లో చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, జూలలోని వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి పక్షి ప్రేమికులు, జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వారి వారి సామర్థ్యాన్ని బట్టి చిన్న చిన్న పక్షులు, తాబేళ్ళు మొదలు పులుల వరకు మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం చొప్పున దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టవచ్చిన మంత్రి సురేఖ తెలిపారు. జంతు ప్రేమికులు అటవీ అధికారులను సంప్రదించి వన్యప్రాణుల దత్తతకు సంబంధించిన మార్గదర్శకాలను అనుసరించి, వారి వారి ఇష్టానుసారం జంతువులను దత్తత తీసుకునే వెసులుబాటును అటవీశాఖ కల్పిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. వన్యప్రాణుల దత్తత కోసం చేసిన



చెల్లింపులకు ఆదాయ పన్ను మినహాయింపు, ఇతర ప్రయోజనాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అటవీ అధికారులకు మంత్రి సురేఖ సూచించారు.

# ఇంత క్రూరంగా కూడా చంపుతారా ?

(మొదటి పేజీ తరువాయి..)



అని మేం నివ్వెరపోయామన్నారు. భార్యను ఇంత దారుణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదన్నారు.' క్షణికావేశంలో జరిగిన హత్య కాదు.. పథకం ప్రకారమే హత్య చేశాడు. గురుమూర్తి స్వతహాగానే క్రూరుడు' అని సీపీ వివరించారు. 'సంక్రాంతి పండగకు మాధవి, గురుమూర్తి తమ పిల్లల్ని తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. 15న పిల్లల్ని బంధువుల ఇంటి వద్దే వదిలేసి వెంకటమాధవి, గురుమూర్తి రాత్రి 10.41 గంటలకు ఇంటికి చేరుకున్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించాం. 16న ఉదయం 8 గంటలకు ఆమెతో అకారణంగా గొడవ పెట్టుకొని ఘర్షణకు దిగాడు. మాధవి తలను గోడకేసి కొట్టి కిందపడిపోయిన తర్వాత గొంతు నులిమి హతమార్చాడు. ఇంట్లో ఉన్న కత్తితో కాళ్లు, చేతులు, శరీరం, తల నాలుగు భాగాలుగా కట్ చేశాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మృతదేహాన్ని ముక్కలు చేసినట్టు గుర్తించాం. వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను ఉడక బెట్టాడు. ఆ తర్వాత వాటిని స్టవ్‌పై పెట్టి కాల్చాడు. రోకలి బండతో ఆ భాగాలను దంచి పొడి చేశాడు. ఆ పొడిని ప్లాస్టిక్ బకెట్‌లో తీసుకెళ్లి జిల్లెలగూడ చెరువులో పోశాడు. ఇంట్లో మొత్తం



ఆనవాళ్లు లేకుండా చేసిన తర్వాత బంధువుల ఇంటికి వెళ్లి పిల్లల్ని తీసుకొచ్చాడు' 'అమ్మ ఏది' అని పిల్లలు అడిగితే ఎక్కడికో వెళ్లిందని చెప్పాడు. చంపినట్లు భౌతిక ఆధారాలు లేకుంటే.. కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. పిల్లలు ఉంటే సాక్ష్యం చెబుతారనే అనుమానంతో వారిని బంధువుల ఇంటి వద్దే ఉంచాడు. రెండ్రోజుల తర్వాత మాధవి తల్లిదండ్రులు అడిగితే.. పోలీస్ స్టేషన్‌కు వచ్చి మిస్సింగ్ కేసు పెట్టారు. ఈ విషయాలన్నీ మాధవి మేనమామకు గురుమూర్తి చెప్పాడు. గురుమూర్తి చాలా క్రూరమైన స్వభావం కలిగిన వ్యక్తి. ఆర్మీలో 15 ఏళ్లు పనిచేశాడు. ఒక పథకం ప్రకారమే భార్యను హత్య చేశాడు. సాంకేతిక ఆధారాలు సేకరించాం అని వివరించారు. వెంకటమాధవి హత్య కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నాం. భార్యను కిరాతకంగా చంపడంపై గురుమూర్తిలో కొంచమైనా పశ్చాత్తాపం లేదు. హత్య కేసులో నిందితుడు ఉపయోగించిన స్టవ్, కత్తి, రోలర్, రోలర్ స్టోన్, బకెట్, వాటర్ హీటర్, రూమ్ ఫ్రెషనర్, యాసిడ్ బాటిల్, డోర్ మ్యాట్, స్క్రాప్ బకెట్, సర్ఫ్ ప్యాకెట్, బ్లాక్ కలర్ షర్ట్, మృతురాలి డ్రెస్, రెండు మొబైల్ ఫోన్లు సహా మొత్తం 16 వస్తువులను సీజ్ చేశాం' అని సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. తన భార్య వెంకట మాధవిని గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.

## సంపాదకీయం..

# అవార్డుల రాజకీయం !

గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం మొదలయ్యింది. గద్దర్ నక్సలైట్ కనుక ఆయనక పద్మ అవార్డు ఎలా ఇస్తామన్నకేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలతో ఇప్పుడు సర్వత్రా చర్చలు..ఉప చర్చలు..విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. తాజాగా తెలంగాణ నుంచి ప్రముఖులు ఎవరికీ పద్మ అవార్డులు రాకపోవడం, దీనిపై సిఎం రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించడం..తిరిగి బండి సంజయ్ విమర్శలు చేయడం తో కథ మొదలయ్యింది. నిజానికిపద్మ అవార్డులే కాదు..ప్రతి ఒక్క విషయంపైనా ప్రజల్లో చర్చ జరగాలి. అనుయాయులకు నామినేటెడ్ రాజ్యసభ సభ్యత్వాలు, పద్మ అవార్డులు, భారతరత్నలు కూడా ఇచ్చేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తి అర్హుడా కాదా అన్నది చూడడం లేదు. గతంలో సచిన్ టెండుల్కర్‌కు భారతరత్న ఇచ్చారు. ఆయన దేశానికి ఏ రకంగా ఉపయోగ పడ్డాడో తెలియదు. తన సొంత కెరీర్, రికార్డుల కోసం మాత్రమే అతను క్రికెట్ ఆడాడు. సామాజికంగా బాధ్యతగా పెద్ద సేవలేవీ చేయలేదు. కానీ దేశానికి సేవ చేయడమే గాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభంగా నిలిచిన రతన్ టాటాకు మాత్రం మనం భారతరత్న ఇవ్వలేదు. ఆయన బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే గౌరవించుకుని ఉన్నట్లుగా ఉండేది. పివి నరసింహారావుకు భారత రత్న ఇవ్వడంలో కాంగ్రెస్ చేసిన రాజకీయం అంతా ఇంతాకాదు. దేశాన్ని నిలబెట్టిన పివిని అవమానించిన కాంగ్రెస్, చివరకు భారతరత్న ఇవ్వకుండా మరింతగా అవమానిం చింది. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యాంగం పేరిట రాజకీయాలు చేస్తోంది. ఇక బిజెపి కూడా సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకు పంపింది. అలాగే కాంగ్రెస్ తెలంగాణ నుంచి అభిషేక్ మనుసింఘ్వీని రాజ్యసభకు పంపింది. తెలంగాణ కోసం కొట్లాడిన ఎందరినో కాదని ఓ లాయర్‌కు అవకాశం ఇచ్చింది. ఎవరు అధికారంలో ఉన్నా నిజాయితీ లేకుండా పోయింది. అందుకు బిజెపి మినహాయింపు కాదని చెప్పాల్సిందే. ఇవన్నీ ఇలావుంటే తాజాగా పద్మ అవార్డుల పంచాయితీ వచ్చింది. తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ రచ్చ చేసింది. ఈ వ్యవహారంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..జాబితా పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్‌డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వక పోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లు.. పద్మ అవార్డుల కోసం పంపించారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అయితే ఇందులో కనీసం చుక్కారామయ్య పేరును కూడా పరిశీలించకపోవడం, కవి అందెశ్రీ పేరును కూడా పరిశీలించకపోవడం దారుణంగానే చూడాలి. గద్దర విషయంలో కూడా బిజెపి అతిగా మాట్లాడడం మానితే మంచిది. గద్దరు ప్రజాకవి. నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా ఉన్నారు. వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మంచిది కాదు. పద్మ అవార్డుల విషయంలో జరిగిన వివక్ష క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా?అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ ప్రశ్నించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఖండించారు... బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి. అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు. అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు. గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ మరో బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే అవార్డుల ఎంపిక ఖచ్చితంగ అపారదర్శకంగానే సాగాలి. అర్హులకే అవార్డులు కానీ, రాజ్యసభ సభ్యత్వాలు కానీ దక్కాలి. బిజెపి ఈ విసయంలో పారదర్శకంగా పనిచేస్తే మంచిది.

# విజయసాయి రాజకీయ సన్యాసంపై అనుమానాలు?

- తాత్కలిక ఉపశమనం కోసం ఎత్తులు వేస్తున్నారా
- జగన్‌తో దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం

**అమరావతి,జనవరి28( వెలుతురు):**

అధికారం ఉంటే దుర్యోధనుడిలా విర్రవీగడం..అధికారం లేకుంటే పాండవుల్లా అజ్ఞాతవాసం చేయడం ఇప్పుడు రాజకీయాల్లో కనిపిస్తున్న ధోరణి. మరో ఐదేళ్ల వరకు రాజకీయాలకు దూరంగా ఉండడం మేలన్న భావనలో కొందరు..అధికార పార్టీలో చేరడంలోమరికొందరు కాలం వెళ్లదీస్తున్నారు. నిజానికి నిబద్ద రాకీయాలు,. నిజాయితీ రాజకీయాలకు కాలంచెల్లింది. ప్రజాసేవ ముసుగులో అందరూ చేసేది స్వార్థ వ్యాపారాలే తప్ప మరోటి కాదు. ఎపిలో ఇప్పుడు పలువురు రాజకీయ నేతల తీరు దీనికి అద్దం పడుతోంది. వైకాపాకు చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి హఠాత్తుగా రాజీఆనామ నిర్ణయం ఎందుకు తీసుకున్నారన్న అనుమానం సహజంగానే కలుగుతుంది. నిజానికి ఇది హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదు. ఏడు మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయిన నాటి నుంచి ఆయన వైఖరిలో మార్పు వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా జగన్‌రెడ్డి ఆయనను దూరం పెట్టారు. దీంతో ఆయన పార్టీలో పూర్వ వైభవం కోసం ప్రయత్నిస్తూ వచ్చినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఒక దశలో భావించారు. అయితే జగన్‌రెడ్డి ఒత్తిడి తేవడంతో పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జిగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు. భవిష్యత్తులో తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోవడం లేదని కూడా విజయసాయిరెడ్డి తాజాగా ప్రకటించారు. అయితే విజయసాయిరెడ్డి సేవలు అవసరమని భావిస్తే జగన్ మళ్లీ పిలుస్తారు. అధికారం వస్తే అన్నీ తారుమారవుతాయని చూస్తూనే ఉన్నాం. తెలుగుదేశం పార్టీ తనను దగ్గరకు రానివ్వదు కనుక భారతీయ జనతా పార్టీలో చేరిపోవాలని కొన్ని రోజుల క్రితం ఆయన భావించారు. తనతో పాటు ఏడెనిమిది మంది రాజ్యసభ సభ్యులను




తీసుకువస్తానని, పార్టీలో చేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి అర్జీ పెట్టుకున్నట్లు వార్తుల వచ్చాయి. అయితే కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడటానికి కారణం అయిన తెలుగుదేశం పార్టీ ఆమోదం లేకుండా పార్టీలో చేర్చుకోలేమని విజయసాయికి తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నుంచి వ్యతిరేకత రాకుండా చూడడం సాధ్యం కాక పోవడంవల్లనే ఆయన తప్పుకున్నారని అంటున్నారు. జగన్‌రెడ్డిపై పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే భారతీయ జనతా పార్టీలో చేరడానికి తాము క్లియరెన్స్ ఇస్తామని తెలుగుదేశం ముఖ్యులు ఆయనకు స్పష్టంచేశారన్న ప్రచారం కూడా జరుగుతోంది. అవినీతి కేసులలో అప్రూవర్‌గా మారితే తనకు ముప్పు తప్పదని భావించిన విజయసాయి రెడ్డి.. మనసు మార్చుకున్నారని మరికొందరి ప్రచారంగా ఉంది. 2029 నాటికి చంద్రబాబు బతికుంటే అప్పుడు తాము అధికారంలోకి వచ్చి ఆయనను జైలుకు పంపుతామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు కూడా. బహిరంగ చర్చకు రావాలంటూ సవాలు విసిరి తోక ముడిచారు. చంద్రబాబును తిడుతూనే జనసేనాని పవన్ కల్యాణ్‌ను కీర్తించారు. కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి వైఎస్ రాజశేఖరరెడ్డితో విజయసాయికి పరిచయం ఏర్పడిన నాటి నుంచి ఆ కుటుంబానికి విధేయుడిగా ఆయన ఉండిపోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆడిటర్‌గా తన తెలివితేటలను ఉపయోగించి క్విడ్ ప్రో కోకు తెర లేపారు. జగన్‌రెడ్డితో అనతికాలంలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మింపజేశారు. మన దేశంలో రాజకీయ అధికారాన్ని మించిన అధికారం లేదు. అలాంటిది ఉన్న ఎంపీ పదవిని కూడా ఆయన ఎందుకు వదులుకుంటున్నారన్న ప్రశ్నలు వస్తున్నాయి. జగన్‌పై సీబీఐ, ఈడీ కేసులలో విచారణ ముందుకు సాగకుండా ఢిల్లీ స్థాయిలో విజయసాయి తన వంతు కృషి చేశారని అంటున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు విధేయుడిగా మారిపోయారు. ఈ విధంగా స్వామి కార్యం, స్వకార్యం చక్కదిద్దుకుంటూ వచ్చారు. అయితే కుటుంబపరంగా, రాజకీయంగా సమస్యలు చుట్టుముట్టడంతో ఆయన కొన్ని రోజులుగా మానసికంగా నలిగిపోయారని చెబుతున్నారు. ఇకపోతే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వారి పాపాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. మద్యం, ఇసుక, భూముల విషయాల్లో విజయసాయిరెడ్డి చేతివాటంపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రంలో, అటు కేంద్రంలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో ఇక లాభం లేదనుకున్న విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్టు ప్రకటించి ఉంటారు. రాజ్యసభ్యుడిగా ఉన్నా జగన్‌కు అనుకూలంగా ఉండలి. అదికూడా లేకపోతే స్వేచ్ఛగా ఉండొచ్చన్న సూచలనతో ఆయన రాజీనామా చేశారని అంటున్నారు. మొత్తంగా మున్ముందు ఏ కేసు ఎలా ముందుకు వస్తుందో ఇప్పుడేచెప్పలేం.

# నేడు మౌని అమావాస్య..పితృదేవతలకు ప్రీతికరం

- దానధర్మాలు..నదీ స్నానాలకు మంచి రోజు
- కుంభమేళాలో స్నానానికి నేడు పోటెత్తనున్న భక్తజనం

**(ప్రయాగరాజ్,జనవరి28 వెలుతురు):**



ఈ నెల 29న మౌని అమావాస్య రానుంది. కుంభమేళా జరుగుతున్న వేళలో ఈ అమావాస్య ప్రత్యేకమైనదిగా పురాణాలు పేర్కొంటున్నాయి. మౌని అంటే సంస్కృతంలో మౌనంగా ఉండటం. ఈ దినాన మౌనదీక్ష పాటించాలి. ఎవరితోనూ మాట్లాడకుండా పూర్తిగా మౌనంగా ఉండాలి. మహాశివరాత్రి ముందు వచ్చే అమావాస్య కావడంతో సాధువులు, యోగసాధకులు దీన్ని పవిత్రంగా పరిగణిస్తారు. శాస్త్రాల ప్రకారం మన ఆలోచనలకు మూలబిందువు చంద్రుడు. అమావాస్య కావడంతో ఆ రోజున చంద్రుని ప్రభావం ఉండదు. అందుకనే మన నోటి నుంచి వచ్చే మాటలపై నియంత్రణ ఉండదు. వీటి నియంత్రణకే పూర్తిగా మౌనం పాటించాలి. మన మనసుపై నియంత్రణ లేకపోతే ఏం మాట్లాడుతామో ఏం చేస్తామో తెలియదు. అందుకే పూర్తిగా మౌనంగా ఉండాలి. దీంతో అంతఃశుద్ధీకరణ జరుగుతుంది. మాటలపై నియంత్రణ ఎలా ముఖ్యమో భగవద్గీతలోని ఒక పద్యం ఇలా వివరిస్తుంది. మానవునికి అతని మనస్సే పెద్ద సాయం చేస్తుంది. ఏ నిర్ణయమైనా మనసే మంచిదో కాదో చెబుతుంది. దీని ప్రకారంగా మనల్ని మనం బాగు చేసుకోవాల్సివుంటుంది. అంతేగాని పెడమార్గం పట్టరాదు. పరిపూర్ణమైన మనసు మిత్రుడిగా ఉంటుంది. కలుషితమైతే శత్రువుగా మారుతుంది. ఆధ్మాత్మికంగా ఈ రోజు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయి. ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుంది ఇంత పవిత్రదినం కావడంతో ఈ రోజే కొత్తగా నాగ సాధువుల్లో చేరేవారికి దీక్షఇస్తారు. రావిచెట్టు నీడలో దీపాలు వెలిగించి పితృదేవతలకు తర్పణం కూడా పెట్టాలి. హిందూ సంప్రదాయంలో అమావాస్యకు ప్రాధాన్యత ఉంది. ఆ రోజున విష్ణుమూర్తి, సూర్యభగవానులను పూజిస్తారు. ముఖ్యంగా పుష్య అమావాస్య లేదా మౌని అమావాస్య మరింత ప్రత్యేకమైంది. ఈ రోజున రాగిగిన్నెలో స్వచ్ఛమైన నీరు, ఎర్ర చందనం, ఎర్రటి పూలు వేసి.. ఆ నీటిని సూర్యుడికి సమర్పించాలి. పూర్వీకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఉపవాసం ఉండి దానధర్మాలు చేయాలి. తులసి మొక్కను పూజించి, తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. ఇలా చేయడం వల్ల పితృ దేవతల దోషాలేమైనా ఉంటే తొలగిపోతాయి. పురాణ కథనం ప్రకారం అమావాస్య రోజున గంగమ్మ తల్లి అమృతంగా మారి ఆకాశం నుంచి కిందికి దిగివస్తుంది. ఈ రోజున గంగానదిలో స్నానం చేస్తే పరమపుణ్యమని, అలా అవకాశం లేకుంటే మరే నదిలోనైనా స్నానం చేయాలన్నది పెద్దల మాట. పుష్య అమావాస్య రోజున చేసే సత్కార్యాలకు గొప్ప ఫలితాలు లభిస్తాయి. ఈ అమావాస్యను లఘు పితృపక్షంగా పరిగణిస్తారు. ఈ రోజున భగవద్గీత పఠించాలి. రావిచెట్టుకు నీరుపోసి, దాని వద్ద దీపం వెలిగించాలి. ఇలా చేయడం వల్ల కూడా పితృదేవతలకు పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. ఈ క్రమంలో మహా కుంభమేళా దారులు పవిత్ర ప్రయాగ్ రాజ్ వైపే.. భక్త జనసంద్రానికి తీరమా.. అన్నట్టుగా త్రివేణి సంగమం సకల జనుల సందడితో కిక్కిరిసిపోతుంది.. విభుడు, దేవాదిదేవతలు దివి నుంచి దిగి వచ్చే అమృత కాలమే మహా కుంభమేళ. ఈ 45 రోజుల్లో ఏ రోజులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శు భాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. ఇప్పటికే కోట్ల మంది భక్తులు స్నానం ఆచరించారు . ఇన్ని రోజులు ఒక లెక్క. ఈ నెల 29న పోటెత్తే రద్దీ మరో లెక్క. బుధవారం మాఘమాస మౌని అమావాస్య మహిమాన్వితమైన సుదినం.. మహాకుంభ మేళలో స్నానమాచరించడమే ఎంతో పుణ్యం. ఇక మాఘ మాస మౌని అమావాస్య కలిసొచ్చిన వేళ.. గంగా స్నానం చేస్తే మరెంతో పుణ్యం. దానాలు చేస్తే జన్మ ధన్యం అనేది భక్తుల విశ్వాసం.. మౌని అమావాస్య రోజున అందరూ షాహి స్నాన్ ఆచరిస్తారు..మౌని అమావాస్య ధ్యానానికి జ్ఞానానికి చిహ్నం. ఆరోజు మౌనంగా వుంటూ ..పరమేశ్వుడిని ధ్యానిస్తూ పవిత్ర గంగా స్నానంచేసి పితృదేవుళ్లకు నీరాజనాలు అర్పిస్తారు. తద్వారా పూర్వీకులకు సద్గతులు కలగడం సహా అందరికీ సకల శుభాలు కలుగుతాయంటారు పండితులు. మహాకుంభమేళానే ఎంతో మహిమాన్వితం. ఇక ఈసారి మౌని అమావాస్య కలిసిరావడం మరెంతో శుభప్రదం..ప్పటికే మహా కుంభ మేళాలకు కోట్లలో తరలి వస్తున్నారు భక్తులు. ఇక మాఘ మాస మౌన అమావాస్య ఒక్కరోజే పది కోట్లకు మంచి భక్తులు తరలి వస్తారనేది అంచనా. మౌన అమావాస్య కోసం భారత రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఎవరికీ ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యూపీ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

# అమెరికాలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఎత్తివేత

- కొత్త ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న ట్రంప్
- దిగుమతి సుంకాలతో భర్తీ చేసుకునేలా ప్లాన్

**వాషింగ్టన్,జనవరి28( వెలుతురు):**

అమెరికా పౌరులకు ఆదాయపు పన్ను నుంచి విముక్తి కల్పించేలా సోమవారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనలు చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఖర్చు చేసి ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకే ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలను ధనవంతులు చేసే వ్యవస్థ పునరుద్ధరణ దిశగా ఈ చర్య ఉపయోగపడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. దుబాయ్‌లో పన్ను రహిత విధానం ఉంది. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి వచ్చే మొత్తం చెప్పుకోదగ్గ స్థాయిలోఉంది. ట్రంప్ నిర్ణయంతో ఆ మేరకు కోతపడితే.. దానిని భర్తీ చేసుకొనేందుకు దిగుమతి సుంకాలను వాడుకోవాలన్నది ప్రణాళికగా చెబుతున్నారు. 'అమెరికన్లను ధనవంతులు, మరింత శక్తిమంతులుగా చేసే వ్యవస్థలోకి మనం వెళుతున్నాం. ఇతర దేశాలను సుసంపన్నం చేసేందుకు మన వారిపై పన్నులు వేసే బదులు.. మనమే విదేశాలపై పన్నులు విధించి అమెరికన్లను సంపన్నులు చేయాలి. వీటిని వసూలు చేసేందుకు ఎక్స్‌టర్నల్ రెవెన్యూ సర్వీసును ప్రారంభించాను' అని రిపబ్లికన్ సభ్యుల సమావేశంలో వ్యాఖ్యానించారు. అమెరికా చరిత్రలోనే 1870 నుంచి 1913 మధ్య ప్రజలు అత్యధిక సంపదతో తులతూగారని ట్రంప్ పేర్కొన్నారు. నాడు సుంకాల ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉండేదని చెప్పారు. అప్పట్లో దిగుమతి సుంకాల నుంచి ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం లభించేదన్నారు. అమెరికా తక్షణమే తన వాణిజ్య వ్యవస్థను మార్చుకోవాలన్నారు. అమెరికా ఉద్యోగులు, కుటుంబాలను రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత్, చైనా, బ్రెజిల్‌పై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. 'బయట దేశాలు ఏం చేస్తున్నాయో చూడండి. చైనా భారీగా పన్నులు వసూలు చేస్తుంది. ఇక భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు కూడా ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. మనం అలా జరగనీయకూడదు. అమెరికా ప్రయోజనాలు అన్నింటికంటే ముందుండాలి' అని పేర్కొన్నారు. వాస్తవానికి ట్రంప్ గత డిసెంబర్‌లోనే బ్రిక్స్ దేశాలు ప్రత్యేక కరెన్సీ తీసుకొస్తే 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. డాలర్ వినియోగం నిలిపేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



# ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన ముస్కు రమణారెడ్డి

- ఉత్తర తెలంగాణ పట్టభద్రుల నియోజకవర్గం లో పోటీ కీ అవకాశం ఇవ్వండి
- కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఉద్యోగులు -నిరుద్యోగుల పక్షాన వారధిగా ఉంటా- రమణా రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జనవరి 28:**
రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి నీ అమిగోస్ ఐ ఏ ఎస్ అకాడమీ ఛైర్మన్ ముస్కు రమణా రెడ్డి కలసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం లోని కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాలో ఖాళీ అవుతున్న గ్రాడ్యుయేట్ నియోజకవర్గం లో గత కొద్ది రోజులుగా ఉమ్మడి నాలుగు జిల్లాలో నిరుద్యోగుల అంశాలపై చేసిన కార్యక్రమాలు గురించి వివరించారు. మొదటి నుంచి పార్టీ విధేయత కలిగిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని చెప్పారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చినట్లు ముస్కు రమణా రెడ్డి వివరించారు. తన అమిగోస్ అకాడమీ ద్వారా తెలంగాణలోని విద్యార్థులకు గ్రూపు 1 మరియు గ్రూపు 2 , సివిల్స్ కోచింగ్ ఇప్పించడం తో పాటు అనేక మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించినట్లు చెప్పిన రమణా రెడ్డి తన బయోడేటా ను ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి కి అందచేసారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి అభ్యర్థుల ఎంపిక పై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మంత్రుల కమిటీ భేటీ అయ్యి నిర్ణయం తీసుకునే అవకాశముంది అని చెప్పారు. తన వంతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానీ తెలిపారు. అందుకు రమణా రెడ్డి వవేం నరేందర్ రెడ్డి, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

# పరీక్షలకు ముందు ఇంటర్ ప్రశ్నపత్రం మార్పు సరికాదు

- ఇంటర్ బోర్డ్ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలి.
- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 28:**
పరీక్ష ప్రశ్నా పత్రాలకు సంబంధించి ఎలాంటి మార్పులు చేయాలన్న విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చేయాలి కానీ దానికి భిన్నంగా ఇప్పుడ్ ఇంటర్ బోర్డ్ మొదటి సంవత్సరం ఆంగ్ల సబ్జెక్ట్ ప్రశ్నపత్రాల నమూనాల మార్పు చేయడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ లకు విద్యార్థులకు తెలియకుండా పరీక్ష పత్రం మార్పు చేయడం అంటే లక్షలాదిమంది పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవడమేనని అన్నారు ఎవరైతే ఈ చర్యలకు పాల్పడ్డారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాజుల డిమాండ్ చేశారు.

# లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేత బోసుపల్లీ ప్రతాప్ మాదిగ



**వెలుతురు మహేశ్వరం జనవరి 28:**
పద్మశ్రీ అవార్డు గ్రహీత పీడిత వర్గాల ఆశాజ్యోతి గౌరవ శ్రీ మందా కృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు జనవరి 28వ తేదీ మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్నటువంటి లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమంలో బీజేపీ నేత బోసుపల్లీ ప్రతాప్ మాదిగ దండోరా నాయకులు కార్యకర్తలు నరుకుడి మహేందర్ %వీ౯ాూ% ప్రధాన కార్యదర్శి జోగు అమరేందర్ గారు జోగు నర్సింహా తదితరులు కలిసి సంకన డబ్బు వేసుకొని మహేశ్వరం కు బయలుదేరిన నాయకులు

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీజీ ఆర్టీసీ చైర్మన్ మల్ రెడ్డి



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 28:**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఆర్ డీ సి శాఖ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి తెలిపారు, హయత్ నగర్ లో ఆర్టీసీ కార్మికులు ఉద్యోగుల విశ్రాంత 11 వ రాష్ట్ర అసోసియేషన్ మహా సభలను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని అలాగే ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలు కల్పించాలని తాము సీఎం ను కలిసి విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలిపారు, ఆర్టీసీ లో ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రేషన్ కార్డులు, పెన్షన్ లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఎం ను కలిసి వినతి పత్రాన్ని అంద జేస్తామని రాం రెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రామ్మోహన్ గౌడ్తో పాటు పదవి విరమణ పొందిన ఆర్టీసీ కార్మికుల సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు,

# జర్నలిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడితే సహించేది లేదు...

- కట్టడి చేయాలంటూ ప్రజాప్రతినిధులకు, పార్టీల నేతలకు విజ్ఞప్తి...
- వినతి పత్రాలు అందించిన కూకట్ పల్లి ప్రెస్ క్లబ్..



**కూకట్ పల్లి జనవరి 28 వెలుతురు:**
జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణ దారుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ నాయకులను కట్టడి చేయాలని శాసనసభ్యులకు రాజకీయ పార్టీల నేతలకు కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికేపూడి గాంధీ, కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, కూకట్పల్లి జనసేన పార్టీ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ లకు వేరువేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిస్టులకు డబ్బులు ఇవ్వాలని భవన నిర్మాణ దారులను బెదిరిస్తూ కొందరు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాళ్ల వల్ల సమాజంలో జర్నలిస్టుల పట్ల చులకన భావం ఏర్పడుతుందని అన్నారు. మున్సిపల్ అధికారులు, కాలనీల సంక్షేమ సంఘం నేతలు సైతం జర్నలిస్టుల పేరు చెప్పి ఇళ్ల నిర్మాణ దారులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇటు రాజకీయ నాయకులను, అటు అధికారులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**ఎవరైనా వసూళ్లకు పాల్పడొద్దు : గాంధీ..**

సామాన్యులను ఇబ్బంది పెట్టే విధంగా జర్నలిస్టుల పేరుతో వసూళ్లకు ఎవరు పాల్పడిన సహించేది లేదని శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ అన్నారు. జర్నలిస్టు సంఘం మూకుమ్మడిగా అందరు కలిసి విజ్ఞప్తి చేయడం హర్షనీయమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**మంచి పరిణామం: మాధవరం కృష్ణారావు..**

కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం శుభ పరిణామమని కూకట్ పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు. సమాజంలో జర్నలిజం విలువలు దిగజార్చ కుండా ఉండేందుకు కూకట్పల్లి ప్రెస్ క్లబ్ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మున్సిపల్ అధికారులతో జర్నలిస్టులతో కలిపి ఉమ్మడి సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. జర్నలిస్టులను బద్నాం చేస్తూ డబ్బులు వసూలు చేసే వారు ఎవరైనా సరే వదిలి పెట్టొద్దని చెప్పారు.

**అన్ని విధాలుగా సహకరిస్తా: బండి రమేష్..**

కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ అన్ని విధాలుగా సహకరిస్తానని కాంగ్రెస్ పార్టీ కూకట్పల్లి ఇంచార్జ్ బండి రమేష్ తెలిపారు. సామాన్యులను జర్నలిస్టుల పేరుతో ఎవరు ఇబ్బందులు పెట్టినా కూడా సరి అయింది కాదన్నారు. ఇప్పటి నుండి అయినా ఈ అంశంపై అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు తొట్ల పరమేష్, ఆర్కే దయాసాగర్, మామి డాల రవీందర్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం ఏ కరీం, కార్యదర్శి రంజిత్ కుమార్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాణిక్య రెడ్డి, గంగరాజు, నవీన్ రెడ్డి, లక్ష్మణ్, సదా మహేష్, హరిబాబు, నజీర్, నాగరాజు, బంటు ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, చంద్ర, పవన్, తిరుపతి, భాస్కర్, నర్సింగరావు, వెంకట్రావు, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## జనం లేక వేలవేల బోతున్న క్యాంపు కార్యాలయం...

# దిక్కుతోచని స్థితిలో ఎమ్మెల్యే

- ఉనికి కాపాడు కోవడం కోసమే పర్యటనలు
- కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్ రెడ్డి



**కూకట్ పల్లి జనవరి 28 వెలుతురు:**
ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో జనాలు లేక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెలవెల బోతోందని, దిక్కుతోచని స్థితిలో ఏం చెయ్యాలో అర్థం కాక తన ఉనికిని కాపాడుకోవటం కోసమే "నేను ఉన్నాను, ఎక్కడా పోలేదు" అని చెప్పకనే చెబుతూ స్మశానాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటనలు చేస్తున్నాడని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో స్మశానవాటికలో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే ఎందుకు పునుకోలేదని, ఇప్పుడు కొత్తగా ఓల్డ్ బోయిన్పల్లి, బాలానగర్ డివిజన్ లలో స్మశానాలు తిరుగుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చెయ్యని అభివృద్ధి, ఇప్పుడు తిరుగుతూ అక్కడ అభివృద్ధి ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేస్తలేదని దుమ్మెత్తి పోయడం ఒక్కటే పనిగా ఎమ్మెల్యే పెట్టుకున్నాడని అన్నారు. ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ లోని అద్దె భవనంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ భవనంలోకి తరలించలేకపోవడం ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనంగా ఉందన్నారు. చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే భూతద్దంలో చూపిస్తూ అధికారులపై నోరు పారేసుకుంటున్నాడని పేర్కొన్నారు. తన మాట అధికారులు ఎవరూ వినడం లేదని స్మశానాల పేరుతో అధికారులను ఎమ్మెల్యే వెంట తిప్పుకునే ప్రయత్నమే చేస్తున్నాడు తప్ప తన పర్యటనతో ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. స్మశానాలలో తిరుగుతూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు.

# దోమల సమస్యలపై స్పందనేది

- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం
- శ్మశాన వాటికల పరిశీలనలో ప్రజల సమస్యలపై స్పందించిన ఏమ్మెల్యే



**కూకట్ పల్లి జనవరి 28 వెలుతురు:**
దోమలను నివారించడంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ స్మశాన వాటికలను స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా బాలానగర్ డివిజన్ చరబండ రాజు కాలనీలోని స్మశాన వాటికలను పరిశీలించి అక్కడ మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ముఖ్యంగా నీటి సదుపాయం లేదని అలాగే పిచ్చి మొక్కలు అస్తవ్యస్తంగా పెరిగి చాలా ఇబ్బందిగా ఉంటుందని .. ప్రధానంగా దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు తెలపగా వెంటనే అక్కడ ఉన్న ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచనలు జారీ చేశారు. కాంపౌండ్ వాల్ నిర్మించి పరిసరాలను శుభ్రం చేయాలని అలాగే నీటి సదుపాయం కల్పించడంతోపాటు మూత్రశాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వినాయక నగర్ లోని స్మశాన వాటికను పరిశీలించి అక్కడ కూడా మౌలిక సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు సరైన నిర్వహణ ఏర్పాట్లు చేయడం లేదని వెంటనే నీటి సదుపాయాలు మౌలిక వసతులు కల్పించి సానిటేషన్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రధానంగా బాలానగర్ లోని నాలా పరిసర ప్రాంతాలు కాలనీలు, బస్తీలలో దోమల బెడద ఎక్కువైందని అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికుల పిర్యాదుతో స్పందించిన ఎమ్మెలే శానిటేషన్ విభాగం అధికారులను, ఎంటమాలజీ విభాగం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ క్రమం తప్పకుండా చేయాలని ఆదేశించారు. దోమలతో ప్రజలు అనారోగ్యం బారినపడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు.

## ఏబీ న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్ వెలుతురు జనవరి 28:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజాన్ని నిర్భయంగా చూపించే ఏబీ న్యూస్ 2025 నూతన క్యాలెండర్ ను స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు చేతుల మీదుగా ఆవిష్కరిం చడం జరిగింది. ఈ సందర్భముగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. న్యూస్ ఛానల్ లు ప్రజలకు ప్రభుత్వాలకు వారదులుగా ఉంటూ సమస్య పరిష్కరిస్తూ సమాజంలో తమ పాత్ర కీలకంగా




పోషిస్తున్నారని అలాగే అభివృద్ధిలో తమ భాగ్యస్వామ్యం ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఏబీ న్యూస్ జహీరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ ని అభినందించి నిజాన్ని నిక్కచ్చిగా చూయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, ప్యాక్స్ చైర్మన్ మచెందర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్ మాజీ ఆత్మ కమిటీ డైరెక్ట్ పద్మజా శేఖర్, మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రేమ్ నాయకులు విజయ్ రాథోడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా పేరు చెబితే భూస్వాముల గుండెల్లో దడ పుడుతుంది పేదలు మాత్రం గుండెకు హత్తుకుంటారు

- గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వవలసిందే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూణంనేని సాంబశివరావు
- ఎరుపు మయమైన చేవెళ్ల గడ్డ



**చేవెళ్ళ వెలుతురు జనవరి 28**

ఎర్ర జెండాను చూస్తే నిరుపేదలు హత్తుకుంటారు అదే ఎర్రజెండాను చూస్తే భూస్వాములు దోపిడి దారులు బెదురుకుంటారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె రామస్వామి అధ్యక్షతన జరిగినచేవెళ్ల నియోజకవర్గం సిపిఐ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎర్ర జెండా భారత గడ్డపై 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 వసంతాలోకి అడుగుపెడుతున్న ఏకైక జెండా ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ అని ఆయన కొనియాడారు. కమ్యూనిస్టులకు అధికారం లేకపోయినా పదవులు లేకపోయినా ఆర్థిక ఇబ్బందులు ఎదురైన ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప సిద్ధాంతం కమ్యూనిజం అని ఆయన కొనియాడారు. కమ్యూనిజం సిద్ధాంతంతో అనేక దేశాలలో సోషలిస్టు రాజ్యాలు ఏర్పడినాయని దోపిడి కోటలను కూల్చి పేదల రాజ్యాన్ని నిర్మించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని ఆయన అన్నారు భూస్వాములు పెట్టుబడిదారులు దగా కోర్లు భూ దందాలు చేసే వారి పట్ల సింహ స్వప్నంగా ఉండే కమ్యూనిస్టు పార్టీ పేదల కన్నీళ్లు తురచడానికి భారత గడ్డపై ఏర్పడిందని ఆయన అన్నారు. భూమి కోసం భుక్తి కోసం పేదల విముక్తికై నాడే నిజాం రాజుకు వ్యతిరేకంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఎర్రజెండా ఏనాడు ప్రభుత్వాలకు రాజీ పడలేని గొప్ప సిద్ధాంతం కమ్యూనిజం అని ఆయన అన్నారు. ఎర్రజెండా పేదలకు అండ దండ ఎర్రజెండానే లేకపోతే భూస్వాములు పెట్టుబడిదారులు ఈ బడుగు జీవులను బ్రతకనిచ్చేవారు కాదని ఎర్రజెండా భారత గడ్డపై ఏర్పడిన తర్వాతనే సామ్రాజ్యవాదులను రాజరిక వ్యవస్థలను దోపిడీని కులదొసి కార్మికులకు పేదలకు హక్కులను సాధించిన గొప్ప పార్టీకమ్యూనిస్టు పార్టీ గుర్తు చేశారు. అసెంబ్లీలో పేదల కార్మికుల సమస్యలను ప్రస్తావించే కమ్యూనిస్టు పార్టీ తరఫున గెలిచిన నేను మాత్రమే మాట్లాడుతున్నాను అని మిగతా సభ్యులంతా రాజకీయాలు పరస్పర ఆరోపణలకు కాలయాపన చేస్తున్నారని ప్రజల సమస్యలను సమగ్రంగా చర్చించి పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందని రేవంత్ రెడ్డి ప్రభుత్వమైన పేదల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోతు రవీంద్ర చారి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం సామిడి శేఖర్ రెడ్డి టి రామకృష్ణ చేవెళ్ల సిపిఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ షాబాద్ మండల కార్యదర్శి ఎన్ జంగయ్య శంకర్పల్లి మండల కార్యదర్శి పి సుధీర్ నాయకులు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ కే చందు యాదవ్ రైతు సంఘం నాయకుడు సుధాకర్ గౌడ్ బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య ప్రజానాట్యమండలి నాయకుడు సుభాన్ రెడ్డిమహిళా సంఘం జిల్లా కార్యవర్గ నిర్వాహక అధ్యక్షులు మంజుల ఇన్సాబ్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు మక్బూల్ ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ బిఓసి జిల్లా నాయకుడు ప్రభాకర్ గీత పని వాళ్ళ సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్ మరియు ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కె.ఉపేందర్ రెడ్డి



**వెలుతురు, హైద్రాబాద్ 28 జనవరి :**

గ్రంథాలయ పెన్షనర్లకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి వేత నాలు ఇవ్వడం న్యాయమైన డిమాండ్ అని, సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కె.ఉపేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ అధ్యక్షతన మంగళవారం తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ ల పెన్షనర్ల కార్యవర్గ సమావేశం చి క్కడపల్లిలోని నగర గ్రంథాల యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల పెన్షన్ల ముఖ్యమైన సమస్య 010, హెల్త్ కార్డు గు రించి ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థికభారం లేనందున ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తె లంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల జేఏసీ అధ్యక్షులు కే.లక్ష్మయ్య మాట్లాడుతూ... పెన్షనర్ల సమ స్య న్యాయమైన డిమాండ్ అన్నారు. పెన్షనర్ల ఎన్నో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎన్నో పరి ష్కారం చేశామని అలాగే ఎటువంటి ఆర్థిక భారం లేనందున మీకు న్యాయబద్ధంగా ఉన్నందున జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల పెన్షనర్లకు 010 పద్దు ద్వారా ట్రెజరీ జీతాలు పెన్షన్లు ఇప్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కొక్కుల దేవేందర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్ర భుత్వం కృషి చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా అనేకసార్లు వినతిపత్రాలు అందజేశామని కుంటి సాకులు అనేకం చెప్పి తప్పించుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం తో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ప్రభుత్వాధినేతతో పాటు ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులకు కూడా వినతి పత్రాలు అందజేశామన్నారు. సీఎం పేషినుంచి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి తాము అందజేసిన వినతి పత్రాలు, ఉత్తరాలు వస్తున్న చర్య లు మాత్రం శూన్యంగా ఉందని వివ రించారు. పెన్షనర్లకు హెల్త్ కార్డులు కూడా లేవని మెడికల్ రీయంబర్స్ మెంట్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ



కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సిద్దుల జ్ఞానేశ్వర్, జి.స త్యనారాయణ , లైబ్రరీ పెన్షనర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమశివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, తుమ్మ సత్యనారాయణ, కే వీరప్ప, అముక్తమాల్యద, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 10 ఉమ్మడి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# నల్గొండ లో మంత్రుల అహంకారం పెరిగాయి కానీ అభిరుద్ధి పెరగలేదు: కేటీఆర్

- నల్గొండ లో జరిగిన రైతు మహా ధర్నా సభలో పాల్గొన్న కేటీఆర్

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 28:**



ఆనాడు తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నింపిన నల్గొండ జిల్లా నేడు ఈ రైతు వ్యతి రేక కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పై తిరుగుబాటుకు వేదిక కావాలని బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు ,నల్గొండలో కాంగ్రెస్ మంత్రులకు ఆకారాలు, అహంకారాలు పెరిగినయ్ కానీ నల్గొండకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు,నల్గొండలో మంగళ వారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాకు హాజరైన బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు శ్రేణులు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన నల్గొండ లోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులు. గొడ్డుకారం పెడుతూ యూనివర్సిటీలో తమను వేధిస్తున్న వైస్ ఛాన్సలర్‌ను తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ కేటీఆర్‌ని కోరినవిద్యార్థులు.అందుకు స్పందించిన కేటీఆర్ తప్పక తన పోరాటం మీకోసం అంటూ విద్యార్థులకు భరోసా కల్పించారు,భవిష్యత్ ఖచ్చితంగా గులాబీ జెండాదే.కాబట్టి కాంగ్రెస్ కార్యకర్తల కంటే అతిగా ప్రవర్తిస్తున్న పోలీసులు, ప్రభుత్వ అధికారులు ఇది గుర్తుపెట్టుకోండి అని కేటీఆర్ అన్నారు.మళ్ళీ వస్తాం.అందరికీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామంటూ కేటీఆర్ హెచ్చరించారు,కాంగ్రెస్ ఇచ్చినమని చెప్పుకుంటున్న ఉద్యోగాలన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లను భర్తీ చేసినవే. రేవంత్ రెడ్డి తన బిడ్డ కాని బిడ్డను.. తనదే అని చెప్పుకుంటూ.. ప్రభుత్వ ఉద్యోగాలు భారీగా ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నాడు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం 6,50,000 రేషన్ కార్డులు ఇచ్చాం, ఆ కార్యక్రమాన్ని పేదవాళ్ళకు పనికొచ్చేది గానే చూశాం తప్ప రేవంత్ చేసినట్లు ప్రభుత్వ పైసలతోని, పెద్ద పెద్ద సభలు పెట్టి సన్నాయి నొక్కులు నొక్కలేదు.పేదవారికి రేషన్ కార్డులు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చారిత్రాత్మకమైన కార్యక్రమం అంటున్న రేవంత్ భావదారిద్ర్యాన్ని తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. 2021లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఇప్పటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అయినా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదంటూ సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారు. ఈ కార్య క్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు,

# డెక్కన్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 28:**

36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా మునిపల్లి మండలం కంకోల్ లోగల డెక్కన్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిచే టోల్ ప్లాజా సిబ్బందికి, వాహన డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీఎల్ ప్రాజెక్ట్ హెడ్ రాజేష్ ప్రభాకర్ విచారే, ఆపరేషన్స్ మేనేజర్ విజయేందర్ రెడ్డి, రూట్ మేనేజర్ గుర్రం నాగరాజ్ %ఒ% టోల్ ప్లాజా సిబ్బంది, మునిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, లారీ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు రైతు భరోస అందించాలి

- బిజెపి మండల అధ్యక్షులు మల్లేశ్ గంగ్వార్



**జహీరాబాద్ వెలుతురు జనవరి 28:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం గంగ్వార్ చౌరాస్తా వద్ద మంగళవారం మధ్యాహ్నం మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు గంగ్వార్ మల్లేష్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం మండలంలో ఒక గ్రామానికి మాత్రమే అందించడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరు రైతుకు అందించవలసిన బాధ్యత ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా ఇస్తానని చెప్పిన ఈ యొక్క కాంగ్రెస్ నాయకులు ఎన్నికల తర్వాత రైతు భరోసా అనే పథకాన్ని నీరు కార్చిన విధంగా చేశారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన తర్వాత మండలంలో ఒక గ్రామానికి మాత్రమే ఈ యొక్క రైతు భరోసా పథకాన్ని పరిమితం చేయడం కరెక్ట్ కాదని, దాన్ని ప్రతి ఒక్క రైతుకు ఈ యొక్క రైతు భరోసా పథకం అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని దాతలు అందించిన అన్నం ప్లేట్లు,గ్లాసుల

- గంగుల పూలమ్మ, శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 28**

మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారి గంగుల వెంకట్ రెడ్డి తన తల్లిదండ్రులైన గంగుల పూలమ్మ శ్రీనివాస్ రెడ్డిల జ్ఞాపకార్థం నీర్నెముల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు 10 వేల రూపాయల విలువైన అన్నం ప్లేట్లు, గ్లాసులను మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, గంగుల వెంకటరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఇలాగే దాతలు ముందుకు వచ్చి పాఠశాల కావలసిన అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నోముల శివ, రాజు, క్రాంతి, బొల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

# డా,, పెండెం కృష్ణ కుమార్ సేవలు వెలకట్టలేనివి.

-కె.అశోక్ డీఈవో



**సూర్యాపేట జిల్లా వెలుతురు జనవరి 28:**

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్, విభిన్న పాత్రాభినయ కళాకారులు, 400 విభిన్న పాత్రదారులు, రచయిత, సమాజ సేవకులు, పర్యావరణవేత్త డా,, పెండెం కృష్ణ కుమార్ సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ నందు గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయములో జిల్లా విద్యాశాఖాధికారి కె. అశోక్ కు జాతీయ నాయకుల, స్వాతంత్ర సమరయోధుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు సరస్వతి దేవి, భారతమాత, సర్వేపల్లి రాధాకృష్ణ, గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే, అంబేద్కర్, స్వతంత్ర సమరయోధుల చిత్రం, కొండ లక్ష్మణ్ బాపూజీ, ఆజాద్ చంద్రశేఖర్, శ్రీనివాస రామానుజన్ చిత్ర పటాలను, వాటర్ క్యాన్, గోడ గడియారం, మరియు అందరికి 15 కేజీల బరువు మోయగల రీయుజబుల్, వాషబుల్ క్లాత్ సంచులు అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ 400 విభిన్న పాత్రలలో నటించి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నాలుగు సార్లు పొందిన పర్యావరణవేత్త ఎన్నో పాఠశాలలందు ఎన్నో సేవలు అందించిన గొప్ప వ్యక్తి డా,, పెండెం కృష్ణ కుమార్. విద్యా వైద్యం పర్యావరణం , పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అభివృద్ధికి తన స్వంత నిధులతో సేవలు చేస్తున్న సేవా దృక్పథుడని, తెలుగు వారి కీర్తిని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన కృష్ణకుమార్ ప్రస్తుత మన భారత దేశ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది మురము చే ప్రశంసలు పొంది రాష్ట్రపతి ఆహ్వానం మేరకు ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ నందు 40 నిమిషాలు ప్రత్యేకంగా సమావేశం జరిపిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గిన్నిస్ బుక్ లోకి నాలుగు సార్లు పొంది, ఎన్నో ప్రభుత్వ పాఠశాలలో సేవలందిస్తూ పర్యావరణము కొరకు లక్ష క్లాత్ బ్యాగులు తన స్వంత నిధులతో ఇప్పటివరకు ఎన్నో సేవలు అందించి అన్ని తన స్వంత నిధులతో చేయటం ఎంతో గొప్ప విషయమని కృష్ణకుమార్ ని అభినందించారు.

# మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 28:**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి సీతక్క ను కలిసి మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చర్చించారు, గ్రామీణ నియోజకవర్గమైన మునుగోడులో జరుగుతున్న కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, మరియు మౌలిక సదుపాయాల కల్పన గురించి మంత్రి సీతక్క తో చర్చించినట్లుగా తెలిపారు,మునుగోడు వంటి అతిపెద్ద నియోజకవర్గానికి పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి అధిక నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కు విన్నవించినట్లుగా ఏమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు,.

# కార్పోరేటర్లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి..)

మేయర్ అయ్యే ఆలోచన తనకు లేదని తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ప్రతిపక్షాలకు హక్కు ఉందని విజయలక్ష్మి అన్నారు. అవిశ్వాసానికి స్వాగతిస్తున్నానని చెప్పారు. అవిశ్వాసానికి ఎంతమంది కావాలో కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తెలియదని అన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ వరకు తామే మేయర్, డిప్యూటీ మేయర్ అని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11వ తేదీ తర్వాత అవిశ్వాసం పెట్టాలి అంటే ముందుగా కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీసియో సభ్యులు 98 మంది కలెక్టర్‌కు లెటర్ ఇవ్వాలని అన్నారు. అదంతా అవ్వాలి అంటే మార్చి అవుతుందని చెప్పారు. ఈ నెల 30వ తేదీన జరిగే జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. అందుకు అందరూ సహకరించాలని చెప్పారు. తనపై అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు తన గురించి తెలుసునని చెప్పారు. అక్రమంగా ఆస్తి సంపాదించాల్సిన అవసరం, ఖర్మ తనకు లేదని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను ఉంటే చేయని ఆరోపణలు, ఇప్పుడు ఎందుకు చేస్తున్నారో అందరికీ తెలుసునని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

# డాక్టరేట్ అవార్డు గ్రహీత సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరాంకు ఘన సన్మానం

-సత్కరించి సన్మానించి సాల్మన్ రాజు



**తూప్రాన్, జనవరి, 28:** ప్రపంచంలోనే ప్రముఖ యూనివర్సిటీ అయిన అమెరికా బార్కెలి లోని తాయోలాజికల్ రిసెర్చ్ యూనివర్శిటీ చాన్సలర్ చేతుల మీదుగా సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్ అత్యంత అరుదైన గౌరవ డాక్టరేట్ పట్టా అందుకోవడం విశేషం అని బైబిల్ కాలేజి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ సాల్మన్ రాజు అన్నారు. తూప్రాన్ బైబిల్ కాలేజి లో సన్మాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్ గారిని బైబిల్ కాలేజి ప్రిన్స్ పాల్, డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ సాల్మన్ రాజు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ సాల్మన్ రాజు మాట్లాడుతూ తూప్రాన్ ముద్దు బిడ్డ అందరివాడు మన జానకిరామ్ అన్న గారు అందించిన సేవలకు గుర్తింపుగా లభించిన డాక్టరేట్ ను నిజంగా అర్హుడైన విశిష్టమైన వ్యక్తి డాక్టర్ జానకిరామ్ అని వారి సేవలను కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత లయన్ డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి నేడు ఎంతో విలువైన సమయం కేటాయించి ఇంత గొప్పగా సన్మానించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తూప్రాన్ లోని ఈ కాలేజీలో భారత దేశంలోనీ వివిధ రాష్ట్రాల నుండి ఉన్నత విద్యను అభ్యసించడానికి తూప్రాన్ లోని బైబిల్ కాలేజి కి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులకు ముందుగా ధన్యవాదములు తెలిపారు. నేడు ఎంతో సుదినం నేను నా జీవితంలో మరువలేనిది మధురానుభూతి గా ఒక తీపి గుర్తుగా మీ ఆదరణ, ఆప్యాయత, అనురాగం జీవితాంతం గుర్తుండి పోతుందన్నారు. మున్ముందు భాద్యతగా కార్యోన్ముఖునిగా మరిన్ని సేవలు అందించాలనే ధృడ సంకల్పంతో ముందుకు వెళతామని తెలిపారు. ఇలాటి గుర్తింపు రావడం, సమాజంలో మరింత గౌరవం పెరిగి ఉన్నత శిఖరాలు అధిరోహించిన తృప్తి ఇక్కడే లభించడంతో చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సాల్మన్ రాజు తోపాటు కాలేజి ప్రిన్స్ పాల్ లియాంగ్ కామేయ్, ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చి డైరెక్టర్ సంధ్య సాల్మన్ రాజు, జోహానన్, జెస్సికా, టి.వి.5 జర్నలిస్ట్ గైనిభైటి భాస్కర్ గౌడ్ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు .

# కొల్చారం మండలం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా

- ఎప్పుడు పిలిచినా వచ్చి ప్రజలకు సేవ చేస్తా - ఆవుల రాజిరెడ్డి
- సీఎం సహాయనిది చెక్కులు అందజేసిన రాజిరెడ్డి





**కొల్చారం, వెలుతురు న్యూస్ జనవరి 28** మండల కేంద్రమైన కొల్చారం లోని బాబా ఫంక్షన్ హాల్ లో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 13 గ్రామలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు రూ. 11 లక్షల 88 వేల 500 విలువగల చెక్కులను ఆవుల రాజి రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడే పథకం అనీ, ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన దరఖాస్తులను త్వరగాపరిశీలిస్తూ మంజూరు చేయడంతో పేదలకు చేయూతగా అందుతుందన్నారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు ఈ సీఎం సహాయనిధి నిధులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కొల్చారం మండల పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని, ఎప్పుడు పిలిచినా వచ్చి ప్రజలకు సేవ చేస్తానని రాజారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, సీనియర్ నాయకులు దేవన గారి శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, ట్రెజరంగ్ మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్లూరు అనిల్ కుమర్, ఏళ్లుగారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యుఅక్రమ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బండి మల్లేశం, డాక్టర్ బాలరాజ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగిపేట విట్టల్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, అంజా గౌడ్, రంగంపేట గ్రామ అధ్యక్షులు గౌండ కృష్ణ, బీసీ సెల్ నాయకులు ఆగం గౌడ్, వెంకట్ గౌడ్, విజయ్ కుమార్, మాజీ సర్పంచులు సునీత వెంకట్ గౌడ్, నాగరాణి నర్సింలు, ఎస్టీ సెల్ నాయకులు పాండు నాయక్, వడ్ల చంద్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ రంగవరం లోని జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్

**(రాపర్తి భాస్కర్ గౌడ్)**
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 28:**







డిజిటల్ క్లాసులలో వచ్చే ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్ధమయ్యేలా ఉండేలా చూసుకోవాలని హెడ్ మాస్టర్ కు సూచిస్తూ, పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం భోదించారు. మంగళవారం మేడ్చెల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ డిజిటల్ తరగతులను పరిశీలించి అందులోని ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ కు సూచించారు. అనంతరం పిల్లలతో ముచ్చటిస్తూ సిలబస్ పూర్తయిందా అని, ఎలా చదువుతున్నారని విద్యార్థులను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. సిలబస్ లోని ఒక గణిత సమస్యను విద్యార్థులకిచ్చి చేయమని తెలుపగా, విద్యార్థులు సమస్యను చేసి కలెక్టరుకు చూపించారు. కలెక్టరు విద్యార్థులను అభినందించి బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్ ను తిరిగి పరిశీలించారు. అవసరమైన సలహాలను సూచనలను హెడ్ మాస్టర్ కు కలెక్టరు సూచించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ల్యాబ్ లోని పరికరాలను పరిశీలించి, వినియోగంలో లేని వాటిని రిప్లేస్ చేయించాలని సూచించారు. లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులలో కొంత మంది చదువుతున్న ఇంగ్లీషు పాఠాన్నితెలుగులో చెప్పమనగా, విద్యార్థులు చదివి అర్థవంతంగా వివరించగా కలెక్టరు సంతోషించి వారికి పెన్నులను బహుకరించారు. అనంతరం ప్రక్కనే ఉన్న అంగన్వాడీని సందర్శించి ఎంతమంది చిన్నారులున్నారని, వారి హాజరు రిజిష్టరును కలెక్టరు పరిశీలించారు. ఏవిధంగా చిన్నారులకు చదివిస్తున్నారని, వారికి అందించే భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే అక్కడే ఉన్న వెటర్నరీ ఆసుపత్రిని కలెక్టరు వెటర్నరి డాక్టరును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి నూతన్ కల్ లోని పల్లె దవఖానాను కలెక్టరు తనిఖీ చేసారు. పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలని కలెక్టరు గౌతం ఆదేశించారు. పల్లె దవఖానాను పరీలించి, పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ప్రచారం చేసి, ఔట్ పేషంట్ శాతాన్ని పెంచాలని డాక్టరుకు సూచించారు. పల్లె దవఖానాను పరిశీలించి ప్రతిరోజు ఔట్ పేషంట్స్ ఎంత మంది వస్తారు, గ్రామంలో జనాభా ఎంత అని డాక్టరు, ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు సుమారుగా 35 మంది ఔట్ పేషంట్స్ వస్తారని డాక్టర్ తెలుపగా, ఓపిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దవఖానాలోని రిజిష్టర్లను కలెక్టరు పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, డిఎం అండ్ హెచ్ఓ రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, ఎంఆర్ఓ శైలజ, ఎంపిడిఓ వసంత లక్ష్మి, జెడ్ పి సిఈఓ కాంతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా

# రోడ్డు భద్రత పై అవగాహనా

- ట్రాఫిక్ రూల్స్ పాటించి, రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందండి..
- ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థిని విద్యార్థులకు ప్రతిజ్ఞ చేయించిన జిల్లా ఎస్పీ.
- ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్...




**జహీరాబాద్ వెలుతురు జనవరి 28:** జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 12బ్లాక్ స్పాట్ లను గుర్తించి అక్కడ డిఎస్పి ఆధ్వర్యంలో కమిటీ లు వేసి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేఘా రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమనికి ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు,ఆటో డ్రైవర్లు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు, వివిధ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి, విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండినవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాల నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. చిన్న, చిన్న నిర్లక్ష్యాల కారణంగా ప్రతి ఏటా ఎన్నో కుటుంబాలు రోడ్డు ప్రమాదాల బారినపడి రోడ్డున పడుతున్నాయని, ఒక కుటుంబ యజమాని కోల్పోతే ఆ కుటుంబ పోషణ బారమై అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. యువత విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, మోటార్ సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. వాహనాన్ని మితిమీరిన వేగంలో నడపరాదని, స్పీడ్ త్రిల్లింగా ఉండొచ్చుకాని, మితిమీరిన వేగం ప్రాణాల మీదికి వస్తుందని గుర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం మత్తులో ఏకాగ్రత కోల్పోయి రోడ్డు ప్రమాదాలు జరగటానికి అవకాశం ఉంటుందని అన్నారు. వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడరాదని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని ఉండి, మీ తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని అన్నారు. నూతన ట్రాఫిక్ చట్టాల ప్రకారం మద్యం సేవించి పట్టుబడితే జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం మాదకద్రవ్యాలు దుర్వినియోగం గురించి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం మన దేశంలో నిషేదించడం జరిగిదని, మాదకద్రవ్యాలు దుర్వినియోగా యానికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్ మహమ్మారి బారినపడి యువత జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. మొదట చిన్న,చిన్న సరదాలు పోయి అదికాస్త వ్యాసనంగా మారే అవకాశం ఉందని, మాదకద్రవ్యాల వినియోగంలో జీవితాలు చిత్తు అవుతాయని గుర్తించాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని, గంజాయి అక్రమ రవాణా, అమ్మకం మరియు సేవించిన వారి పై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అలవాటుపడిన నేరస్తులపై పి.డి-యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులెవరైయన మాదకద్రవ్యాలు వినియోగించినట్లు తెలిసినట్లైతే అట్టి వారిపై కేసు నమోదు చేసి, విద్యాసంస్థల నుండి టర్మినేట్ చేయించడం జరుగుతుందన్నారు. మీ తల్లిదండ్రులు మీ భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఉంటారని గుర్తు చేస్తూ, వారి ఆశ వమ్ముచేయకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. సైబర్ నేరాలు గురించి మాట్లాడుతూ.. సైబర్ నేరాలు అనేవి ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు ఎదురుకుంటున్న సమస్య అని, సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ఒక్కటే మార్గం అని అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దని అన్నారు. జిల్లాలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలలో జహీరాబాద్ ఒకటని, సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో విద్యావంతులే అధికం అన్నారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ ల పేరుతో ఏ పోలీసు అధికారి కూడా నేరుగా వాట్స్ ఆప్ వీడియో కాల్స్ చేయరాని, డిజిటల్ అరెస్ట్ అని కాల్స్ వస్తే నమ్మరాదన్నారు. బందులు జబ్బుపడ్డారని, మీకు పార్సిల్ వచ్చిందని అనుమానిత ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ వస్తే సంబంధిత పోలీసు స్టేషన్లో సమాచారం అందించాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ నందు రిపోర్ట్ చేయాలని సూచించారు. అమాయక ప్రజల బాలహీనతే, సైబర్ మోసగాళ్ల బలంగా.. వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో టెక్నాలజీని వాడుకొని మరిన్ని సైబర్ మోసాలు చేయడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు.

కావున ప్రతిఒక్కరు సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ నేరాల నుండి బయటపడవచ్చని, ఇంటి వద్ద పెద్దవారికి కూడా ఈ సైబర్ మోసాల జరుతున్న తీసరును గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలోపు 1930 కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి.(https://www.cyber-crime.gov.in) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, జహీరాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ శివలింగం, రూరల్ ఇన్స్పెక్టర్ హనుమంతు, సబ్-డివిజన్ ఎస్ఐ లు వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# లింగ వివక్షపై అవగాహన

- లింగ వివక్షతపై వాల్ పోస్టర్లు చూపుతున్న ప్రాజెక్టు ఆఫీసర్, ప్రిన్సిపల్, టీచర్లు




**సంగారెడ్డి జిల్లా, వెలుతురు జనవరి 28:**
నారాయణఖేడ్ మండలంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి పడావో భేటీ బచావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లింగ వివక్ష పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని జూకల్ శివారులోని బీసీ వెల్ఫేర్ స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింలు, బాలల హక్కులు మరియు చట్టాలను పోక్స్ చట్టం మరియు నిర్భయ చట్టం మరియు హెల్ప్ లైన్ నంబర్స్ 100,101,108,1098 గురించి,మరియు సైబర్ నేరాలు,మద్యపానం, ధూమపానం వల్ల జరిగే అనర్ధాల గురించి తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీను మాట్లాడుతు లింగ సమానత్వం,బాలురు క్రమశిక్షణ, తోటివారితో ఎలా మసులుకోవలో,మహిళలను,ఆడపిల్లలను ఎలా గౌరవించలో వివరించారు. స్టూడెంట్స్ మంచి చదువులు చదివి సమాజంలో ఉన్నతమైన వ్యక్తిత్వంగల వారుగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో టీచర్లు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## ఉత్తమ అంగన్వాడీ ఆయాని సన్మానించిన రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు సత్యరాజ్ ఉపారపు



**ఇంద్రవెల్లి వెలుతురు జనవరి 28:**
విది నిర్వహణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిందుకు ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన అంగన్వాడీ ఆయ శ్రీ రాథోడ్ కళబాయి గారు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఆయాగా అవార్డు అందుకోగా విషయం తెలుసుకున్న రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఉపారపు సత్యరాజ్ ఈరోజు ఇంద్రవెల్లి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి కళబాయికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి సావిత్రి బాయి పూలే ఫొటో బహుకరించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కళబాయి గారి చేతుల మీదుగా అనేక మంది పిల్లలు పెరిగి ప్రయోజకులు అయ్యారని ఉత్తమఆయా గా ఎంపిక కావడం సంతోషకరమణి అయన అన్నారు. కార్యక్రమంలో అతీష్ కుమార్ అంగన్వాడీ టీచర్ అనిత స్థానిక మహిళలు రాధిక రాథోడ్ అనసూయ లత బాయి శాంత బాయి తదితరులు ఉన్నారు.

## గ్రామీణ సడక్ యోజన తారు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్...



**కరీంనగర్ వెలుతురు జనవరి 28:**
కరీంనగర్ రూరల్ మండలం నగునూరు వయా తీగలగుట్టపల్లి మీదుగా రాణిపూర్ వరకు చేపట్టిన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన తారు రోడ్డు పనులను మంగళవారం రోజున 1వ డివిజన్ కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్ , కరీంనగర్ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఇక్కడి రహదారి నిర్మాణం కోసం కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ చొరవతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద దాదాపు 2 కోట్ల 15 లక్షల రూపాయలతో తీగలగుట్టపల్లి మీదుగా రాణిపూర్ వరకు లింకు రోడ్డుకునిధులుమంజూరయ్యాయన్నారు. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల ఈ రోడ్డు పనులు జరగలేదని , ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ దృష్టికి రహదారి సమస్యను తీసుకువెళ్లి పనులను పున ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో పనులు ప్రారంభమయ్యాయని, తీగల గుట్టపల్లి నుండి రాణిపూర్ వరకు ఈ తారు రోడ్డు పనులు పూర్తయితే తీగలగుట్టపల్లి ,నగునూరు, రాణి పూర్ ప్రజలకే కాకుండా రానున్న రోజుల్లో కొత్తపల్లి రైల్వే స్టేషన్ జంక్షన్ కు వెళ్లడానికి ప్రజలందరికీ ఈ రోడ్డు సౌకర్యవంతంగా అందుబాటులో ఉంటుందన్నారు. ఇట్టి రోడ్డు నిర్మాణానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కి ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లి ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ చెప్పారు..

# ఒంటెగడ్డ తాండాలో ఘనంగా 25వ పాత పంటల జాతర

**జహీరాబాద్ వెలుతురు జనవరి 28:**
25వ పాత పంటల జాతరలో భాగంగా మంగళవారం జహీరాబాద్ మండలంలోని ఒంటెల్గడ్డతాండ గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఉదయం 11.30ని.లకు గ్రామస్తులు బండ్లకు పూజలు చేసి జాతరను ప్రారంభించినారు. జాతరలో భాగంగా ఊరి ప్రజలు ఆటపాటలతో, విత్తనాలతో అలంకరించిన బండ్ల ఊరేగింపు గ్రామంలోని వీధి వీధి యందు కొనసాగింది. ఈ జాతరలో గ్రామానికి చెందిన చిన్న. పెద్ద అందరు కలిసి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్. నర్సిములు, డిడియస్ మాట్లాడుతూ పేద రైతులు, చిన్ని రైతులు ఒకప్పుడు తాండలో పశువులు, మేకలు, కోళ్ళు, కనబడుతుండే, బలమైన తిండి దొరుకుతుండే, ఇప్పుడు మన పొలంలో బలమైన పంటలు పెట్టాలి. మన పిల్లలకు బలమై తిండి పెట్టాలి అన్నారు. హేమలత, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త, డిడియస్ కెవికె మాట్లాడుతూ అప్పటి కాలంలో జొన్నలు తినేవాళ్ళు. మంచి బలమైన తిండి, జొన్నలు తింటే మన శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది, షుగర్, బి.పి రాకుండా తగ్గిస్తుంది, మనకు శరీరానికి క్యాల్షియం ఎక్కువ అవసరం కాబట్టి తైద అంబలి తాగాలి. సజ్జ రొట్టె తినడం వల్ల ఎముకలకు బలం వస్తుంది, శరీరంలో క్యాల్షియం పెరుగుతుంది. డిడియస్ కెవికెలో సేంద్రీయ ఎరువులపైన,



తెనెటీగల పెంపకం పైన శిక్షణలు ఇస్తాము. డిడియస్ కెవికెలో నాణ్యమైన టమాట నారు పెంచుతున్నాము అన్నారు. లాలిబాయి, రైతు మాట్లాడుతూ జొన్న, కొర్ర, సామ, తైద, సజ్జ, పుండి పంటలు పెట్టుకుంటున్నాము. కాని ఈ పంటలకు పిట్టలు ఎక్కువ తింటున్నాయి. వీటి నుండి పంటలను కాపాడవలసిన అవసరం ఎంతగానో ఉందని అన్నారు. చుక్కమ్మ, డిడియస్ మాట్లాడుతూ సంఘం మెంబర్లు 4 రకాల పంటలు పెడితే అన్ని పక్షులు తినిపోతాయి, ఊరి వాళ్ళందరితో ఈ పంటలు పెట్టించాలి. కొందరి దగ్గర పోయిన కొందరి దగ్గర మిగులుతాయి. ఈ సంవత్సరం ఎన్ని ఎకరాలల్లో పంటలు పెట్టాలి అనేది మాట్లాడాలి అన్నారు. మోతిబాయి,



సంఘం మెంబర్ మాట్లాడుతూ మా తాండ నుండి మా ఊరిలో గుంతలు పడ్డ భూములు అన్ని సాగు చేసి పంటలు పండిస్తున్నాము. మేము రాసులు చేసి పంట తింటే మాకు లాభం, మాకు లాభం అన్నారు. ఈ కార్యక్రమంలో జాతర కోఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల, డిడియస్ సిబ్బంది జనరల్ నర్సమ్మ, చిన్న నర్సమ్మ, అనురాద, విజయలక్ష్మి, చుక్కమ్మ, బాలయ్య, నర్సిములు, ప్రహ్లాద్, గ్రామ కార్యకర్తలతో పాటు డిడియస్ – కెవికె గృహవిజ్ఞాన శాస్త్రవేత్త హేమలత పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఏఈ పై అవినీతి ఆరోపణలు

- పైసలు లేనిదే పనులు కావు అంటూ ఆరోపిస్తున్న వినియోగదారులు
- వార్త కవరేజ్ కి వెళ్ళిన విలేకరిపై ఏఈ భౌతిక దాడి
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విలేఖరి
- ఏజీ పై చర్యలు తీసుకోవాలటూ డిమాండ్ చేసిన విలేకరుల సంఘం



విద్యుత్ కార్యాలయంలో నిద్రిస్తున్న ఏఈ హైమద్ హలీ



ఏ ఈ పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న విలేకరుల బృందం



ఏఈ హైమత్ అలీ ఫైల్ ఫోటో

**కొల్చారం, వెలుతురు న్యూస్ జనవరి 28:**
కొల్చారం సబ్‌స్టేషన్లో పని చేస్తున్న విద్యుత్ శాఖ ఏఈ హైమత్ అలీపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. స్థానికంగా పనిచేస్తున్న అధికారులు సైతం ఆయనకే వత్తాసు పలుకుతున్నారంటూ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఏఈరెండేళ్ల ఏళ్లుగా ఒకే చోట పనిచేయడం బాగా కలిసిస్తోందని సర్వత్రా వినిపిస్తోంది. ప్రతి పనికి రేటు కట్టి వసూలు చేస్తున్నాడని, ఏ పని అయినా రేటు కుదిరితేనే పనులు జరుగుతుందన్నాయని ఆరోపణలున్నాయి. ఇందుకను గుణంగా ఇదే మండలంలో పనిచేస్తున్న మరో లైన్ మెన్ ఇటీవల ధర్మవరం బదిలీ అయినా అతను అక్క డికీ వెళ్లకుండా పాతస్థానంలోనే పనిచేస్తూ ఉండడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. సదరు లైన్మెన్ పై సైతం అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ జరిగిన వెళ్లకుండా ఇక్కడే పని చేస్తున్న లైన్మెన్ తో ఓ అధికారి కుమ్మక్కై వినియోగదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతు న్నట్టు సమాచారం. ఆ లైన్మన్ ఓ రైతు నుంచి ట్రాన్స్ ఫార్మర్ కోసం రూ.15 వేలు తీసుకున్నట్టు తెలిసింది. కాగా ఆ సొమ్ము సరిపోదని రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. అంత సొమ్ము ఇచ్చుకోలేని రైతు స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు వెళ్తానని చెప్పడంతో రైతు దగ్గర నుంచి లైన మన్ జారుకున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా అవినీతి ఆరోపణలపై ప్రశ్నించడానికి ఓ విలేఖరి కార్యాలయానికి వెళ్ళగా పనివేళలో సదరు ఎయ్యి కార్యాలయంలో బెంచి పై పడుకుని నిద్రిస్తూ కనిపించాడు. ఏఈ నిద్రలేచిన వెంటనే సదరు విలేకరు అవినీతి ఆరోపణలపై ప్రశ్నించగా ఆవేశానికి లోనైనా ఏఈ విలేకరిని యు చీటర్, బ్లాక్మెయిలర్ అంటూ దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఏఈ ప్రవర్తనతో నిరసన తెలిపిన విలేఖరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కొల్చారం మండల విలేకరుల సంఘం తరఫున పలువురు విలేకరులు మాట్లాడుతూ విలేఖరి పై ఏ ఈ దాడిని ఖండించారు. అధికారులు వెంటనే ఏఈ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఏ ఈ సైతం సదరు విలేఖరి పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# 6వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి, పాత్రికేయులకు ఘనంగా సత్కారం

**వెలుతురు బొల్లారం జనవరి 28:**
గడిచిన ఐదు సంవత్సరాల తమ పదవి కాల సమయంలో తమ వార్డు అభివృద్ధితో పాటు మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడిన బొల్లారం మున్సిపల్ సిబ్బందికి, పారిశుద్య కార్మికులు, పాత్రికేయులను 6వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన









సత్కార కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందిని ఘనంగా పౌర సత్కారం నిర్వహించారు. తొలుత పారిశుద్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి వారి వారి చిత్రపటాలతో కూడుకున్న జ్ఞాపికలను అందిస్తూ శాలువాతో సత్కరించారు. మున్సిపల్ సిబ్బందికి సైతం ఇదే తరహాలో సత్కరం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ మంగతాయారు మాట్లాడుతూ తమ పదవి కాలంలో పనిచేసిన వారిని గుర్తించుకొని అందరికి సన్మానం చేయడం అభినందనీయం అని, అదేవిదంగా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి మరెన్నో ప్రజాహిత కార్యక్రమాలు చెసి మరిన్ని మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.బొల్లారం మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ నరసింహులు,మేనేజర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ తమతో పాటు సేవలందించిన అందరిని గుర్తించుకొని వారిని సత్కరించడం ద్వారా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి దంపతులు వారి గొప్ప మనసుని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గడిచిన తమ పదవి కాల సమయంలో మున్సిపల్ సిబ్బంది, పాత్రికేయులు సహకరించడంతో తమ వార్డు పరిధిలో అభివృద్ధి చేయగలిగామని వారితో పాటు పారిశుద్య కార్మికులు సహాయ సహకారంతో పారిశుద్య లోపం లేకుండా చేయగలిగామని అన్నారు. ఇటీవల మరణించిన పారిశుద్య కార్మికుడు నరసింహ కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. తమ కార్యక్రమానికి అతిద్యం ఇచ్చిన శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు హరికృష్ణ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ కాలనీ వాసులు, యువకులు, జిఎమ్ఆర్ ఫాలోవర్సు తదితరులు పాల్గొన్నరు.

## జూన్‌లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదవి పొందిన వాళ్ల రెండేళ్ల పనితీరుపై సమిక్ష చేస్తామని తెలిపారు. దాని ఆధారంగా మళ్లీ నిర్ణయాలు, భవిష్యత్ అవకాశాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో పదవి ఆశిస్తున్న వాళ్లు క్యూబ్స్ విభాగాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై ఇందులో చర్చించారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని తేల్చి చెప్పారు. 7 నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామన్న చంద్రబాబు ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని, ఈ విషయంలో వైకాపా తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాల ని నేతలకు సూచించారు. మెంబర్ షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, నేతల పనితీరు వంటి అంశాలపై వారితో చర్చించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని... కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. చరిత్రలో తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజలు, కార్యకర్తల ఆశలు తీర్చేందుకు, ఆకాంక్షల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. 2029లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు తెలిపారు. ప్రభుత్వ పని తీరును నిరంతరం పర్యవేక్షించు కుంటూ, మెరుగుపరుచుకుంటూ పనిచేయాలని నిర్దేశిరచారు. ఏడు నెలల కాలంలో ఎన్నో పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టామని.. ఈ విషయాలను నిరంతరం ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని... ఈ విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టాలని ఆదేశించారు. గత 5 ఏళ్లు కార్యకర్తలు తిరుగులేని పోరాటం చేశారని.. వారి కష్టం ఫలితమే మొన్నటి ఎన్నికల విజయమని చెప్పుకొచ్చారు. కార్యకర్తలను ఎప్పుడూ గౌరవించుకోవాలని... ఎన్నికలు అయిపోయాయి తాను ఎమ్మెల్యే, ఎంపి అయిపోయాను అని ఎవరూ భావించవద్దన్నారు. కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పేర్నినాని ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో ఏం జరిగిందంటే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు సరైన ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవులు పొందే ప్రతి ఒక్కళ్లు పార్టీ స్ట్రక్చర్ అయిన క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్‌లో ఉండాలని... అలాంటి వారినే పదవుల కోసం నాయకులు సిఫారసు చేయాలని వెల్లడించారు. ఏ స్థాయి వారు అయినా క్యూబ్స్‌లో మెంబర్‌గా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో ఈ నియామకాలు పూర్తి చేస్తామని చెప్పారు. జూన్‌లోపు ప్రభుత్వంలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులు పూర్తి చేస్తామని తెలిపారు. మెంబర్‌షిప్ బాగా చేసిన వారికి పదవుల్లో ప్రోత్సాహం ఇస్తామన్నారు. మంత్రులు.. జిల్లాల్లో ఎమ్మెల్యేలతో కూర్చుని పార్టీ అంశాలపై చర్చించాలని.. సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నరేగా పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు పని చేయాలన్నారు. ఇతర పార్టీల నుంచి నిన్న మొన్న వచ్చి చేరిన వారి కంటే... ఎప్పటి నుంచో పార్టీలో ఉండి పనిచేసిన వారిని నేతలు ప్రోత్సహించాలని అన్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే అని స్పష్టం చేశారు. ప్రజల్లో సంతృప్తి ఉండాలని.. భవిష్యత్‌పై నమ్మకం, భరోసా కలగాలని ఇదే కూటమి ప్రభుత్వ విధానమన్నారు. ఇప్పుడు ప్రజలకు ఏం చేస్తామని... భవిష్యత్ లో ఏం ఇస్తాం అనేది ప్రజలకు పార్టీ నేతలు వివరించాలన్నారు. ఇప్పటికే వ్యవస్థలను గాడిలో పెట్టామని... రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



# నాటి సీఎం కేసీఆర్‌తో ఎవరినీ పోల్చలేం

## - జగదీశ్‌రెడ్డి



**నల్లగొండ,జనవరి28( వెలుతురు):**
రైతు పక్షాన నిలబడి వారి శ్రేయస్సు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన నాటి సీఎం కేసీఆర్‌తో ఎవరినీ పోల్చలేమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కుక్క మూతి నేతలకు మేం భయపడం. తెలంగాణ రాష్ట్రం రైతాంగం మద్దతుతో ఏర్పడిందని జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నాలో ఆయన కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో కరెంట్ ధరల పెంపును ఒప్పుకోను అని చెప్పి నాడు కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులే మద్దతుగా నిలిచారన్నారు. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' నినాదాలతో తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారం చేపట్టారు. అధికారంలోకి వచ్చాక రైతులను రాజులను చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నీలదీస్తే కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. అయినా కేసీఆర్ ఆదేశాలతో కేటీఆర్, రైతులు నల్లగొండకు భారీగా తరలి వచ్చారు. కేటీఆర్‌కు రాహుల్ గాంధీనే పోటీ, ఇక్కడ జిల్లా నేతల గురుంచి కాదని స్పష్టం చేశారు.

# పవన్‌కల్యాణ్ ఉండగా లోకేశ్ ఏలా ఇస్తారు డిప్యూటీ సీఎం పదవి

## - టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**అమరావతి,జనవరి28( వెలుతురు):**
నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని టీడీపీ కార్యకర్తలు చేస్తున్న డిమాండ్‌పై టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో బుచ్చయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు లోకేశ్‌కు



డిప్యూటీ సీఎం ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ కోసం లోకేశ్ ఎంతగానో కష్టపడ్డారని.. అందుకు సముచిత స్థానం ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెట్టుబడిదారులు పారిపోయారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కూటమిపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ, రాయలసీమ కేంద్రాలుగా పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో ఏపీ, తెలంగాణ ముందుకు వెళ్తున్నాయని అన్నరు. ఉమ్మడి ఆస్తుల విషయంలో ఇంకా క్లారిటీ రావాల్సి ఉందని చెప్పారు. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖ కేంద్రంగా విజయసాయిరెడ్డి దోపిడీ చేశారని మండిపడ్డారు. వేల ఎకరాలు, లక్షల కోట్లు దోచుకున్న వ్యక్తి విజయసాయి రెడ్డి అని అన్నారు. ఏ2గా ఉన్న విజయసాయి కేసుల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేశారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎవరికైనా సరే శిక్ష తప్పదని హెచ్చరించారు. అధికారం పోయిన తర్వాత పార్టీలో చేరిపోదామనుకుంటే.. చేర్చుకోవడం సరైనది కాదని అన్నారు. విజయసాయిని బీజేపీ చేర్చుకుంటుందని అనుకోవడం లేదని తెలిపారు. వైసీపీ రాబోయే రోజుల్లో కనుమరుగవుతుందని అభిప్రాయపడ్డారు. తొందరలోనే వైసీపీలో అందరూ సర్దుకుంటారని అన్నారు.


# మేము అధికారంలోకి వచ్చాక మీ కార్యకర్తలను కాపాడుకుంటారా.?

## - వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**అమరావతి,జనవరి28( వెలుతురు):**
కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే వైసీపీ నేతలను టార్గెట్ చేసి.. వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా నెల్లూరులో మంత్రి నారాయణ.. వైసీపీ నేతలను టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టేందుకు.. వైసీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బాలకృష్ణారెడ్డి కొత్తగా నిర్మించిన ఇంటిని అక్రమ నిర్మాణమని కూల్చేయడమే అందుకు నిదర్శనమని అన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలతో అధికారులు ఇంటిని కూల్చేయడం ఏమిటని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తారని భావించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే.. నెల్లూరులో ప్రజల ఇళ్లను కూల్చివేసి.. వారి దుఃఖానికి కారణం అవుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఇది తగదని ఇలాంటి చర్యలను ప్రజలు ఎవరు ఉపేక్షించరని హెచ్చరించారు. నెల్లూరులో ప్రజలకు అందించే సంక్షేమ పాలన ఇదేనా అని టీడీపీని పర్వతరెడ్డి నిలదీశారు. దీనికి నారాయణ, శ్రీనివాసరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదని.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు టీడీపీ నేతలు.. వాళ్ల కార్యకర్తలను కాపాడుకోగలరా అని ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని.. ఇలాంటి పరిణామాలు పునరావృతమైతే.. తెలుగుదేశం పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# రాష్ట్రహోదా ఎప్పుడు?




**జమ్మూ కాశ్మీర్ ,జనవరి28( వెలుతురు):**
జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామంటూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పటం మరొక దాటవేత ధోరణి. శ్రీనగర్ వెళ్లి జెడ్ సొరంగ మార్గాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞాపనను విలేకరులు ప్రస్తావించగా, మోడీ చేసిన ఈ వ్యాఖ్యలో చిత్తశుద్ధి కనపడలేదు. ఆ తగిన సమయం ఏమిటో, ఎప్పుడు వస్తుందో అన్నది పెద్ద ప్రశ్నార్థకం.

'మోడీ మాట ఇచ్చాడంటే తప్పడు' అంటూ ఆ సమయంలో తనకు తాను కితాబు ఇచ్చుకున్న ప్రధాని - గతంలో మాట ఇచ్చి తప్పిన వైనాలెన్నో! విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కు తీసుకొచ్చి, ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఆ మాటను గంగలో కలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని వెంకన్న సాక్షిగా వాగ్దానం చేసి, కొన్నాళ్లకే తుంగలో తొక్కారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ విషయంలోనూ ఇదే నాటకం ఆడుతున్నారు.

2019 ఆగస్టు మొదటివారంలో పెద్దఎత్తున సైన్యాన్ని మోహరించి, సమాచార సాంకేతిక వ్యవస్థను స్తంభింపజేసి, జమ్మూకాశ్మీర్ రాష్ట్రహోదాను, రాజ్యాంగంలోని 370, 35 (ఎ) అధికరణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష చర్య ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కాశ్మీరీ ప్రజలు మొత్తాన్ని గంపగుత్తగా ఉగ్రవాదు లన్నట్టుగా చిత్రీకరిస్తూ, నెలల తరబడి తీవ్ర నిర్బంధం విధించిన వైనం సమీప భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరగనిది. బయటికి చెప్పుకున్నా మత ప్రాతిపదికన రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి, తమ రాజకీయ బలాన్ని పెంచుకోవటానికి కాషాయశక్తులు చేసిన నిర్వాకం ప్రపంచ విదితమే! చారిత్రిక నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కులను తుత్తునియలు చేసి, కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలకు నిలువునా పాతరేసిన మోడీ ప్రభుత్వం .. అక్కడ వివిధ పార్టీల నాయకుల పైనా, ప్రజలపైనా నిరంకుశంగా వ్యవహరించింది. ప్రజల భూముల పరిరక్షణకు ఉన్న ప్రత్యేక చట్టాలనూ రద్దు చేసింది. కార్పొరేట్లు, ఇతర సంపన్నులూ కాశ్మీర్ భూభాగంలో సులభంగా పాగా వేసేందుకు వీలు కల్పించింది. ప్రజాస్వామాన్ని ఖూనీ చేసింది. ఆఖరికి సుప్రీం కోర్టు ఆదేశంతో గతేడాది సెప్టెంబర్లో శాసనసభకు ఎన్నికలు జరిపారు. ఆ ఎన్నికల్లో గెలవాలని బిజెపి ఎన్ని పన్నాగాలు పన్నినా .. నేషనల్ కాన్ఫరెన్స్ %-% కాంగ్రెస్ కూటమికి ప్రజలు పట్టం కట్టారు. లోక్‌సభ ఎన్నికల కన్నా ఐదు శాతం ఎక్కువ పోలింగుతో తమ ఆకాంక్షను, బిజెపి వ్యతిరేకతనూ బలంగా వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడచిపోయినా, మోడీ ప్రభుత్వం ప్రజాతీర్పు పట్ల పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తోంది.

జమ్మూకాశ్మీర్ ప్రత్యేక రక్షణ చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం - టీ 33 సొరంగమార్గంలో రైల్వేలైను వేయటాన్ని గొప్పగా చెప్పుకుంటోంది. ఇకపై దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ ఢిల్లీ మీదుగా కాశ్మీర్‌కు నేరుగా ప్రయాణం సాగించవొచ్చని చెబుతోంది. ఈ రైల్వేలైనుపై జనవరి 26న వందేభారత్ రైలు తొలి ప్రయాణం చేయటానికి సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు, రైలు రవాణా సదుపాయాలను మెరుగుపర్చటం అభ్యంతరకరం కాదు గానీ, ప్రజల న్యాయబద్ధమైన హక్కులను పునరుద్ధరించకుండా రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్టు ఉపన్యాసాలు దంచటం కచ్చితంగా అసమంజసం.

జమ్మూకాశ్మీర్‌లో ప్రజలను అనుమానించే, వేధించే చర్యలు ఇప్పటికీ ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ స్వయంగా చెబుతున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన రాష్ట్రంలో ముఖ్య మంత్రికి, శాసనసభకూ ఉన్న అధికారాలు, అవకాశాలూ పరిమితం. పోలీసులను నియంత్రించే, నిర్దేశించే కనీస అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. ఈ నేపథ్యంలో అక్కడి బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలూ శాసనసభలో చేసిన రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక గుర్తింపులను పట్టించుకోవాలి. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నరు రూపంలో సాగుతున్న కేంద్ర ప్రభుత్వ పెత్తనానికి తక్షణం స్వస్తి చెప్పాలి. పొరుగు దేశాలతో సరిహద్దులు కలిగి ఉన్న సున్నితమైన ప్రాంతంలో రాజకీయ క్రీడలు ప్రమాదకరం. కాబట్టి, వెంటనే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించటం ప్రజాస్వామికం.

# తెలంగాణలో పెట్టుబడులు...మరి ఏపీ సంగతేంటో...

**హైదరాబాద్, జనవరి 28, వెలుతురు:**
16 ప్రముఖ సంస్థలు.. 1,64, 050 కోట్ల పెట్టుబడులు..(1.79 లక్షల కోట్లు అని కాంగ్రెస్ చెబుతోంది) 47,550 ఉద్యోగాలు.. పరోక్షంగా అంతకుమించి.. తెలంగాణ రైజింగ్ అనే నినాదాన్ని నిజం చేసి చూపించాం.. పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాదును నెలకొల్పాం.. కాంగ్రెస్ సోషల్ మీడియా గురువారం ఉదయం నుంచి ఇవే లెక్కలు చెబుతోంది.సన్ పెట్రో కెమికల్స్ అనే సంస్థ 45,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైంది. ఈ కంపెనీ భారీపంప్డ్ స్టోరేజీ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తుంది. జల విద్యుత్తు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది.. 3400 మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్ ను ఉత్పత్తి చేస్తుంది. 5,440 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తుంది.అమెజాన్ కంపెనీ వెబ్ సర్వీసెస్ విభాగంలో పెట్టుబడులు పెట్టనుంది. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్ విభాగంలో 60 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.కంట్రోల్ ఎస్ అనే సంస్థ అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనుంది. 400 మెగాబట్ల సామర్థ్యంతో డాటా సెంటర్ నిర్మించనుంది. ఇందులో భాగంగా 10 వేల కోట్లు పెట్టుబడి పెడుతుంది. దీని ద్వారా 3,600 మందికి ఉపాధి లభిస్తుంది.

ఏోచి సంస్థ మానవ రహిత ఏరియల్ సిస్టం తయారీ యూనిట్ నెలకొల్పనుంది. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తులను తయారుచేస్తుంది.. ఈ ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిలో కీ రోల్ ప్లే చేస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ కంపెనీ 800 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. 200 మందికి ఉద్యోగాలు అందిస్తుంది.స్కై రూట్ ఏరో స్పేస్ అనే సంస్థ తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ లను తయారు చేయనుంది. ఇంటిగ్రేషన్, టెస్టింగ్ యూనిట్ కోసం 500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.మేఘా(కంపెనీ మూడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. 2,160 మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టును నిర్మించనుంది. అనంతగిరిలో వరల్డ్ క్లాసు లగ్జరీ వెల్నెస్ రిసార్టును నిర్మించనుంది 15వేల కోట్ల పెట్టుబడులను పెట్టడం ద్వారా 5,250 మందికి ఉపాధి కల్పిస్తుంది.ఊఅఒ కంపెనీ హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 5000 మందికి ఉపాధి





లభిస్తుంది.విప్రో కంపెనీ గోపనపల్లి క్యాంపస్ లో కొత్త ఐటీ సెంటర్ ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా 5,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.ఇన్ఫోసిస్ పోచారంలో క్యాంపస్ ను విస్తరించనుంది. 750 కోట్లు పెట్టుబడులు పెడుతుంది. దీని ద్వారా 17,000 మందికి ఉద్యోగాలు కల్పిస్తుందికామారెడ్డి జిల్లాలో యూనిలీవర్ కంపెనీ పామాయిల్ ఫ్యాక్టరీ రిఫైనింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తుంది. బాటిల్ క్యాప్ లను ఉత్పత్తి చేస్తుంది. ఈ కొత్త తయారీ యూనిట్ ద్వారా 1000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్.. ఈ కంపెనీ హైదరాబాదులో అత్యధిక డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తుంది. మూడువేల మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ను నిర్మిస్తుంది. 15వేల కోట్లను దశలవారీగా పెట్టుబడులుగా పెడుతుంది.. వేలాది మందికి ఈ కంపెనీ ఉద్యోగాలు ఇస్తుంది.ఉర్సా క్లస్టర్స్: ఈ కంపెనీ అమెరికన్ చెందింది. ఇది అత్యాధునిక ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్ ను ఏర్పాటు చేయనుంది. 5000 కోట్లను పెట్టుబడులుగా పెడుతుంది..బ్లాక్ స్టోన్: ఈ కంపెనీ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఉంది.. ఇది 150 మెగా వాట్ల డేటా సెంటర్ ను ఏర్పాటు చేయనుంది..4,500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఈ కంపెనీ వేలాది మందికి ఉపాధి కల్పిస్తుందిఅక్షత్ గ్రీన్ టెక్: ఈ కంపెనీ అత్యధిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారు చేస్తుంది. దీనికోసం 7000 కోట్లను పెట్టుబడులుగా పెడుతోంది. ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్: ఈ కంపెనీ ఆరోగ్య సంరక్షణలో పేరుపొందింది.. ఇది 800 మందికి ఉద్యోగాలు అందించేలాగా హైదరాబాదులో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది.సుహానా మసాలా: సంగారెడ్డిలో ప్రస్తుతం సుహాన ప్లాంట్ ఉంది. దీని పక్కనే ఎక్స్ లెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయనుంది. మరీ ఏపీలో..: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ వెళ్లినట్టుగానే.. చంద్రబాబు, నారా లోకేష్, ఇతర అధికారులు దావోస్ వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కో కంపెనీతో ఒప్పందం మినహా.. మిగతా కంపెనీలతో ఎం ఓ యు లు, పెట్టుబడులు కుదుర్చుకున్నట్టు కనిపిస్తోంది. ఒకవేళ ఈ ప్రశ్నను గనుక టిడిపి లేదా దాని అనుకూల మీడియాను వేస్తే.. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులు కేవలం కనెక్టింగ్ ప్లాట్ ఫారం లాగానే ఉపయోగపడతాయి. అంతే తప్ప అక్కడే అన్ని కుదిరిపోవాలని లేదు. గతంలో మాత్రం దావోస్ విజయాలంటూ టిడిపి అనుకూల మీడియా ఊదరగొట్టింది. మరి ఇప్పుడు పెట్టుబడులు రాకపోవడానికి జగన్ నీచ విధానాలు.. నికృష్ట పరిపాలనే కారణమని ఆల్రెడీ మొదలుపెట్టారు. లోకేష్ ఆల్రెడీ అదే తిరుగా మాట్లాడుతున్నాడు. అధికారంలోకి జగన్ మరోసారి రాడని చెబితే తప్ప కార్పొరేటర్లు పెట్టుబడులు పెట్టరని అంటున్నాడు.. కనీసం ప్రచారం కోసమేనా చంద్రబాబు నాలుగు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెబితే మీడియా ఎలాగూ డబ్బాలు కొడుతుంది కదా..తెలంగాణ ను కెసిఆర్ మస్తు అభివృద్ధి చేశాడు.. అందువల్లే ఈ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. కోట్లకు కోట్లను కార్పొరేటర్లు కుమ్మరిస్తున్నారని గులాబీ నాయకులు.. గులాబీ అనుకూల మీడియా ఇంకా ప్రచారం మొదలుపెట్టలేదనుకుంటా..

# ఆరాంఘర్ ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

- **డివైడర్‌ను ఢీకొన్న టూ వీలర్**
- **ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం**

**హైదరాబాద్,జనవరి28( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి క్రాస్ రోడ్ సమీపంలో ఆరాంఘర్ ఫ్లై ఓవర్ పై ఓ బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొకరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందడంతో... ఈ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. సోమవారం అర్ధరాత్రి రాత్రి ఒంటి గంట సమయంలో ప్రమాదం జరిగింది. పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. ముగ్గురు మైనర్ బాలురు బహదూర్‌పురా నుంచి ఆరాంఘర్ వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న స్కూటీ ప్రమాదానికి గురైంది. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన ఈ ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ను సీఎం రేవంత్ రెడ్డి ఈ జనవరి మొదటి వారంలో ప్రారంభించారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో భాగంగా జూ పార్క్ - ఆరాంఘర్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర తెలంగాణ ప్రభుత్వం దీనిని నిర్మించింది. అయితే అర్ధరాత్రి యువకులు ఓవర్ స్పీడ్‌తో వెళ్లి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.



# విషాదంగా యూపి లడ్డూ మహోత్సవం

- **వేదిక కూలి ఐదుగురు దుర్మరణం**

**లక్నో,జనవరి28(ఆర్ఎన్ఎ):**
ఉత్తర ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లడ్డూ మహోత్సవం నిర్వహిస్తున్న ఓ వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. 60 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీలోని బాగ్‌పత్‌లో ఆదినాథుడి నిర్వాణ లడ్డూ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా చెక్కతో ఏర్పాటుచేసిన వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అంతేకాక.. జైన శిష్యులు, పోలీసు సిబ్బందితో సహా 60 మందికి పైగా గాయపడ్డారు. మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదంపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్



**తిరుమల,జనవరి28(వెలుతురు):**
శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం జీఎస్ఎల్వీ ఏఫ్-15 శాటిలైట్‌ని ప్రయోగించనున్న నేపథ్యంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. నారాయణన్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. వెంకన్నను దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం కొత్త మైలురాయిని చేరుకోబోతున్నట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. 1979లో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో మొదటి ప్రయోగం నిర్వహించగా.. బుధవారం నిర్వహించే ప్రయోగం వందోదని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. జీఎస్ఎల్వీ ఏఫ్-15 శాటిలైట్ అంతరిక్షంలోకి పంపడం ద్వారా నావిగేషన్‌ను సులభంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుందని నారాయణన్ చెప్పారు. ఇప్పటివరకూ 433 విదేశీ ఉపగ్రహాలను శ్రీహరికోట నుంచి ప్రయోగించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. రూ.4 వేల కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ఫ్యాడ్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రయోగానికి ఈ లాంచ్ ఫ్యాడే ఉపయోగించనున్నట్లు నారాయణన్ తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌కు అవమానం

- **వివాదాస్పదంగా అధికారుల తీరు**




**అమరావతి,జనవరి28(వెలుతురు):**
గుంటూరు జిల్లా డీఆర్‌సీ సమావేశంలో ఏపీ మంత్రి నారా లోకేష్‌కు అవమానం జరిగింది. సమావేశంలో అధికారులు వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఉద్యోగుల కాళ్ల వద్ద మంత్రి లోకేష్ నేమ్ ప్లేట్ ఉండటం చర్చనీయాంశంగా మారింది. వేదికపై ఉండాల్సిన రాష్ట్ర మంత్రి నేమ్‌ప్లేట్ ఉద్యోగుల కాళ్ల దగ్గర ఉంచారు. దీంతో కలెక్టరేట్ ఉద్యోగుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో సమీక్ష మండలి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రిగా ఉన్న లోకేష్ ఈ సమావేశానికి రాలేదు. డయాస్ మీద లోకేష్ పేరుతో ఉండాల్సిన నేమ్‌ప్లేట్‌ను తీసి ఉద్యోగస్తుల కాళ్ల వద్ద పెట్టారు అక్కడి సిబ్బంది. దీన్ని చూసి తోటి ఉద్యోగులు, మీడియా సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, మంత్రిగా ఉన్న లోకేష్ సమావేశానికి హాజరుకానంత మాత్రాన డయాస్ మీద నుంచి ఆయన నేమ్‌ప్లట్‌ను తీసి ఉద్యోగుల కాళ్ల వద్ద పెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. దీనిపై ఉద్యోగులు ఎలాంటి సమాధానం చెబుతారో చూడాలి.

# ఈ పిటిషన్‌పై ఒక్క మాట మాట్లాడిన జరిమానా వేస్తా

- **సీనియర్ లాయర్ అయి ఉండి మీరేలా వస్తారని నిలదీత**
- **చంద్రబాబుపై పిటిషన్‌పై సుప్రీంకోర్టు అసహనం... పిటిషన్ కొట్టివేత**



**అమరావతి,జనవరి28(వెలుతురు):**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేసులను సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిటిషన్ వేసిన బాలయ్య తరపు లాయర్‌పై సుప్రీం ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది పనికిమాలని పిటిషన్ అంటూ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై ఒక్కమాట మాట్లాడినా భారీ జరిమానా విధిస్తామని సుప్రీం ధర్మాసనం హెచ్చరించింది. ఈ పిటిషన్‌పై వాదించడానికి ఎలా వచ్చారని లాయర్ మహేంద్రసింగ్‌ను జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన కేసులను సీబీఐకి బదిలీ చేయాలని, ఆయన ప్రస్తుతం సీఎంగా ఉన్నారని కేసులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఒక్క మాట కూడా వినకుండానే ఈ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఇది పూర్తిగా పనికిమాలిన పిటిషన్ అంటూ జస్టిస్ బేలాయం త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీఐడీ నమోదు చేసిన ఏడు కేసులు సీబీఐకి బదిలీ చేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాది బీ బాలయ్య పిటిషన్ దాఖలు చేశారు. బాలయ్య తరపున సీనియర్ లాయర్ మహేందర్ సింగ్ వాదనలు వినిపించేందుకు ముందుకు రాగా.. ఆయనపై కూడా జస్టిస్ త్రివేది తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించి ఒక్క మాట మాట్లాడినా భారీ జరిమాన విధిస్తామని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌ను వాదించేందుకు మీలాంటి సీనియర్ న్యాయవాది ఎలా వచ్చారని కూడా ప్రశ్నించారు. వెంటనే ఆ పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది.

# సుప్రీంకోర్టు డెడ్‌లైన్‌తో కొల్లేరులో మళ్లీ టెన్షన్





**అమరావతి,జనవరి28(వెలుతురు):**
కొల్లేరు మళ్లీ టెన్షన్ పెడుతోంది. చేపల చెరువులు పట్టుకునేవారికి నిద్ర పట్టడంలేదు. సుప్రీం కోర్టు డెడ్‌లైన్‌తో రాజకీయ నాయకులకు సయితం దిక్కుతోచని పరిస్థితి వస్తోంది. కొల్లేరు అభయారణ్యం పరిధి, అక్రమ చెరువుల అంశం మరోమారు చర్చనీయాంశంగా మారింది. కొల్లేరులోని అక్రమ చెరువులను కొట్టేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో కొల్లేరు కబ్జాదారులు కంగు తిన్నారు. నిన్న మొన్నటి వరకు తమ చదరంగంలో కొల్లేరును పావుగా వాడుకున్న రాజకీయ పార్టీల పరిస్థితి ఇప్పుడు అయోమయోంలో పడింది. కొల్లేరు కాంటూరు పరిధిని తగ్గించాలని.. కొల్లేరు వాసులు దశాబ్దాలుగా చేస్తున్న వినతి సుప్రీం కోర్టు తాజా ఆదేశాలతో పుట్టదాఖలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కొల్లేరు రాజకీయ పార్టీలకు ఎప్పుడూ తరగని సొమ్ములిచ్చే అక్షయ పాత్రే. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కొల్లేరు పరిధిలో ఉండే ఎమ్మెల్యేలు అక్రమంగా చేపల చెరువులు తవ్వడం, తద్వారా కోట్లాది రూపాయలు వెనకేసుకోవడం పరిపాటిగా మారింది. మరోవైపు చూస్తే ప్రతి రాజకీయ పార్టీ కొల్లేరు కాంటూరును కుదిస్తామంటారు. అధికారంలోకి వచ్చాక అధి మాపని కాదని వ్యవహరిస్తారు. 2006 వరకు కొల్లూరు వాసులకు ఈ సమస్య లేదు. తర్వాత ప్రారంభమైన ఈ సమస్య కొల్లేరు గ్రామవాసులకు ఉపాధి ఆహారం లేకుండా చేసింది. వేలాది మంది ప్రజలు వలసలకు దారి తీసింది. కొల్లేరులోని 77,138 ఎకరాలను అభయారణ్యంగా ప్రకటిస్తూ 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎటువంటి ఆక్రమణలు అక్రమ చెరువు చేపలు ఉండకూడదు. జీవో జారీ చేసిన టీడీపీ ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా వదిలేయడంతో కొల్లూరు వాసుల ఉపాధికి, అక్రమ చెరువులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే 2006లో జీవో అమలు చేసే క్రమంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం కొల్లేరులోని అన్ని చెరువులను ధ్వంసం చేసింది. దాంతో ఆ చెరువులపై ఆధారపడిన కొల్లేరు వాసులకు ఉపాధి లేకుండా పోయింది. కొన్ని గ్రామాల ప్రజలైతే ఇతర రాష్ట్రాలకు చెరువుల్లో పని చేయడానికి వలస వెళ్లిపోయారు. కానీ 2009లో రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని అప్పటి వైఎస్ సర్కార్ కొల్లేరు అభయారణ్యాన్ని 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి అప్పటి యూపీఏ సర్కార్‌కు పంపింది. అలా తగ్గించడం వలన అభయారణ్యం విస్తీర్ణం దాదాపు 40 వేల ఎకరాలకు తగ్గి అవన్నీ పేదలకు అందుబాటులోకి వస్తాయనేది ఈ తీర్మానం సారాంశం. కేంద్ర రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మీళ్లీ ఈ సమస్య ఎదురవ్వడంతో అప్పటి పర్యావరణ మంత్రి జయరాం రమేష్ స్వయంగా కొల్లేరులో పర్యటించారు. తర్వాత ఆయన నియమించిన అజీజ్ కమిటీ కొల్లేరులో పర్యటించి కాంటూరు కుదింపు అంశంపై అధ్యయనం చేసింది. అదే కమిటీ కొన్ని నెలల తర్వాత కుదింపు సాధ్యం కాదని తేల్చింది. 2014, 2009 ఎన్నికల్లోనూ కాంటూరు కుదింపు అంశం తెరపైకి వచ్చింది. అన్ని పార్టీలు ఒకే తరహాలో కాంటూరును కుదించేస్తామంటూ హామీలు గుప్పించాయి. అయినా ఫలితాలు శూన్యం. 2024 ఎన్నికల్లో కొల్లూరు అంశం రాజకీయ పార్టీలకు తూరుపు ముక్కగా మారింది. 2019 ఎన్నికల్లో ఈ అంశానని జగన్ తన ఎన్నికల ఎజెండాలో ప్రధాన సమస్యగా ప్రస్తావించారు. ఒక్క అవకాశం ఇవ్వండి కాంటూరు పరిధిని తగ్గించి చూపిస్తానంటూ చెప్పడంతో అక్కడి ప్రజలు నమ్మారు. ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన జగన్ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలు కొల్లూరు ఓటర్ల ఓట్లు కోసం అన్ని ప్రయత్నాలు చేశాయి. ఈ విషయంలో కొల్లేరు వాసులు టీడీపీని నమ్మి ఆ పార్టీ పక్షాన నిలబడ్డారు. కూటమి అధికారంలోకి రావడంతో కొల్లేరు వాసులకు కాస్త ఊరటనిచ్చాయి. ఈ పరిస్థితుల్లో కొల్లూరు ఆక్రమణలపై సుప్రీం విచారణ చేపట్టింది. దాంతో అటవిశాఖ అధికారులు కొల్లేరులో అక్రమ చెరువులు ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన విచారణలో న్యాయస్థానికి న్యాయవాదులు వివరించారు. ఇంకా 17వేల ఎకరాల్లో అక్రమచెరువులు ఉన్నాయని కోర్టుకు విన్నవించారు. వాటిని కూడా మార్చిలోగా తొలగించాలని న్యాయమూర్తులు ఆదేశించగా ప్రస్తుత అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ఈ పరిణామాలు అటు ప్రభుత్వానికి ఇటు ప్రజాప్రతినిధులకు మింగుడు పడని విధంగా మారింది.

# సూపర్ సిక్స్ పథకాలకు ఇక శుభం కార్డే

- **డబ్బులుంటేనే పథకాలు అమలని బాబు సూక్తులు**
- **చంద్రబాబు వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫైర్**

**అమరావతి,జనవరి28(వెలుతురు):**
కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం ఇచ్చిన ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనమని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాఫ్ అని ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారని చంద్రబాబుపై షర్మిల మండిపడ్డారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలంటున్నారని.. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు అని విమర్శించారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆరోపించారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని.. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారని.. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని.. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు



ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, గత వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తుచేశారు. జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెప్పే బాబు గారు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరమని నిలదీశారు. 'సూపర్ సిక్స్' పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారమని ప్రశ్నించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే అని గుర్తుచేశారు. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరేనని.. తీరా ఓట్లు పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని.. పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ తరఫున షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోదీని పట్టుబట్టాలన్నారు. పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాలని.. నీతి ఆయోగ్ చెప్పినట్లుగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చాలన్నారు. పథకాలకు కేంద్రం డబ్బులివ్వకపోతే వెంటనే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలని సూచించారు.

# రాజ్యాంగాన్ని విశ్వసించని వారికి పద్మ అవార్డు ఎలా ఇస్తారు..?

- **నక్సలైట్లతో ఎంతోమందని పోలీసులను బలితీసున్నాడు : ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్**

**అమరావతి,జనవరి28(వెలుతురు):**
గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వాలన్న అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రెండు మూడు రోజులుగా వాగ్వాదం జరుగుతుంది. నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తికి అవార్డులు ఎలా ఇస్తారని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నిస్తుంటే.. గద్దర్‌కు అవార్డు ఎందుకు ఇవ్వరని సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను నిలదీస్తూనే ఉన్నారు. పద్మ అవార్డుల ఎంపికై తెలంగాణలో మొదలైన ఈ చిచ్చు ఇప్పుడు ఆంధ్రాకు కూడా పాకింది. గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడంపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ మండిపడ్డారు. రాజ్యాంగాన్ని విశ్వసించని వ్యక్తికి పద్మ పురస్కారం ఎలా ఇస్తారని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. గద్దర్ మాత్రం నక్సలైట్లతో కలిసి ఎంతోమందిని హత్య చేయించారని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. గద్దర్‌ను ఎల్‌టీటీ ప్రభాకరన్, నయీమ్‌తో పోల్చారు. అనేక మంది పోలీసులను చంపిన కేసులో కోర్టులకు తిరగలేనని రాష్ట్రపతికి గద్దర్ లేఖ రాసుకున్నారని గుర్తుచేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు కాబట్టి



గద్దర్‌కు పద్మ పురస్కారం ఇవ్వాలా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. రాజీవ్‌గాంధీని చంపిన వారికి కూడా పద్మ పురస్కారం ఇవ్వమంటారా అని ప్రశ్నించారు. గద్దర్‌కు ఎల్‌టీటీ తీవ్రవాదులకు తేడా లేదని వ్యాఖ్యానించారు. మాజీ మావోయిస్టు, రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వ్యక్తికి ఏ హెూదాలో పద్మ అవార్డు ఇవ్వాలని అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. ఉగ్రవాదాలకు కూడా పద్మ అవార్డులు అడుగుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పద్మ అవార్డుల గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ తెలియని వాళ్లు రేవంత్‌కు సలహాలు ఇస్తున్నట్లు ఉందని అన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ బలి

**అమరావతి,జనవరి28(వెలుతురు):**
తెనాలిలో వైద్యుల నిర్లక్ష్యానికి ఓ మహిళ ప్రాణం కోల్పోయింది. కుటుంబ నియంత్రణ కోసం వచ్చిన ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేశారు. అది వికటించడంతో గాజుల పావని(32) అనే మహిళ మృతి చెందింది. ఈ ఆపరేషన్ చేయడంలో వైద్యుల నిర్గక్షం స్పష్టంగా కనిపిస్తోంది. ఆపరేషన్ చేసే సమయంలో వైద్యులు చిన్న ప్రేగుకు, యూరినరీ బ్లాడర్‌కు గాయం చేశారు. దీంతో ఆమె శరీరం విషతుల్యమై షాక్‌లోకి వెళ్లింది. అప్రమత్తమైన వైద్యులు హుటాహుటిన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే పావని చనిపోయిందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### - ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్,జనవరి28(వెలుతురు):**
స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హెూటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీస్, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ కీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత్ర కోసం ఏదైనా చేస్తావా.?

## చేదు అనుభవం గురించి నోరువిప్పిన నటి

క్యాస్టింగ్ కౌచ్ పై మరో హీరోయిన్ గళం విప్పింది. దక్షిణాది సినిమా పరిశ్రమలో ఒక డైరెక్టర్ తనను కమిట్మెంట్ అడిగాడంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆమిర్ ఖాన్ బ్లాక్ బస్టర్ మూవీ 'దంగల్'లో అమిర్ కూతురి పాత్రలో నటించిన ఫాతిమా సనా షేక్ ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో తన కాస్టింగ్ కౌచ్ అనుభవం గురించి మాట్లాడింది 'దంగల్' చిత్రంలో నటించి ఓవర్ నైట్ క్రేజ్ తెచ్చుకుంది నటి ఫాతిమా సనా షేక్. అయితే చాలామందికి తెలియని ఈ విషయం ఏమిటంటే ఈ అందాల తార ఒక తెలుగు సినిమాలోనూ నటించింది. ' సౌత్ ఇండియన్ సినిమాల్లో నటిస్తే బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వస్తాయి. అదే కారణంతో కొన్ని సౌత్ ఇండియన్ సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నాను. కానీ అక్కడ నాకు చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్‌లో సినిమా ఆడిషన్ ఉంటుందని, ప్రొఫైల్ పంపమని నా స్నేహితుడు చెప్పాడు. అలాగని నా ఫోటోలు పంపితే.. నాకు ఫోన్ చేసిన వ్యక్తి 'ఈ పాత్ర కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనా?' అని అడిగాడు. అతని ఉద్దేశం నాకు అర్థమైంది. కానీ, అర్థం కానట్టు, 'ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డాను. పాత్రకు కావాల్సినంత పని చేస్తాను' అని అన్నాను. కానీ అతను పదేపదే అడుగుతూనే ఉన్నాడు 'ఏదైనా చేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా'? నేను కూడా అతని ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోలేని విధంగా సమాధానమిస్తున్నాను. కానీ చివరికి అతను చిరాకుపడి ఫోన్ కట్ చేసాడు' అని ఫాతిమా తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. హైదరాబాద్‌లో ఓ నిర్మాతను కలిసిన సమయంలో ' ఇక్కడ నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడుతారు. మీకు తెలుసా.. ఇక్కడ మీరు కొందరిని కలవాల్సి ఉంటుంది అనేవాళ్లు. ఆ విషయం నేరుగా చెప్పేవా ళ్లు కాదు. ఎలా చెప్పినా వారి ఉద్దేశమైతే అదే అని తెలిసిపోయేది' అని ఫాతిమా తెలిపింది. దీంతో ప్రస్తుతం ఈ నటి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# వాడు నా ఫ్రెండ్ - అనిల్ రావిపూడి


టాలీవుడ్‌లో సక్సెస్ ఫుల్ దర్శకుడిగా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా నడుస్తున్న విషయం తెలిసిందే.. కానీ ఈ యంగ్ డైరెక్టర్ మాత్రం ఆ సినిమాల జోలికి పోకుండా తాను నమ్ముకున్న కథతో లోకల్ గానే ఓ రేంజ్ లో హిట్స్ అందుకుంటున్నాడు. ఇక రీసెంట్ గా విక్టరీ వెంకటేష్ తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు అనిల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమా కోసం థియేటర్స్ దగ్గర క్యూ కడుతున్నారు. ఇప్పటికీ ఈ సినిమా హౌస్ ఫుల్ బోర్డ్స్ తో కలలకాలాడుతుంది. ఇక అనిల్ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి దర్శకుడిగా మారిన తర్వాత వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు. పటాస్ సినిమాతో అనిల్ డైరెక్టర్ గా మారాడు. ఈ సినిమా విడుదలై ఇటీవలే 10 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ 10ఏళ్లలో అనిల్ ఫ్లాప్ అంటూ ఎరుగకుండా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. పటాస్, సుప్రీమ్., రాజా ది గ్రేట్,సరిలేరు నీకెవ్వరు, ఎఫ్ 2, ఎఫ్ 3, భగవంత్ కేసరి, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో భారీ హిట్స్ అందుకొని దూసుకుపోతున్నాడు. ఇదిలా ఉంటే అనిల్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కమెడియన్ సప్తగిరి తనకు బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పారు. అంత బెస్ట్ ఫ్రెండ్ కు తన సినిమాలో ఎందుకు ఛాన్స్ ఇవ్వలేదో కూడా చెప్పారు అనిల్. సప్తగిరి ఫోన్ చేసి తన సినిమాలో ఒక్క సీన్ రెండు సీన్స్ అయితే నేను చేయను అని అంటాడు. సరే రా ఫుల్ లెన్త్ క్యారెక్టర్ నీకు తగ్గది దొరికితే చేద్దాం లే అని నేను అన్నాను. కానీ ఇప్పటి వరకు అది కుదరలేదు. అదే వాడు ఒకటి రెండు సీన్స్ అయినా పర్లేదు అంటే.. వాడికి కోసం ఓ మంచి కామెడీ సీన్స్ చేసేవాడిని అని సరదాగా చెప్పుకొచ్చారు అనిల్. అలాగే సప్తగిరి నేను చాలా క్లోజ్ ఫ్రెండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్స్ గా ఉన్నప్పటి నుంచి మేము మంచి ఫ్రెండ్స్ అని అనిల్ తెలిపారు.





# నయనతార డాక్యుమెంటరీపై హైకోర్టు కీలక తీర్పు

లేడీ సూపర్ స్టార్ నయనతార తన పెళ్లి డాక్యుమెంటరీ కోసం అనుమతి లేకుండా 'నానుమ్ రౌడీ దాన్' చిత్రంలోని సన్నివేశాన్ని ఉపయోగించుకుంది. దీంతో హీరో ధనుష్ కోర్టులో కాపీరైట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన 'నెట్‌ఫ్లిక్స్ ఇండియా' ధనుష్ పిటిషన్ ను కొట్టేయాలని మద్రాసు హైకోర్టులో దరఖాస్తు చేసింది. అయితే ఈ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. గత నవంబర్‌లో నయనతార, ఆమె భర్త విఘ్నేష్ శివన్, వారి నిర్మాణ సంస్థ 'రౌడీ పిక్చర్స్' ధనుష్‌పై కేసు పెట్టాడు. 'నెట్‌ఫ్లిక్స్' డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిర్ టేల్'లో 'నానుమ్ రౌడీ దాన్' చిత్రంలోని 3 సెకన్ల సన్నివేశాన్ని ఉపయోగించారని ధనుష్ ఆరోపించారు. అనుమతి లేకుండా వాడిన సీన్‌ను 24 గంటల్లోగా తొలగించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ధనుష్ హెచ్చరించారు. అయితే ఆ సీన్ మాత్రం తీయలేదు. దీంతో ధనుష్ న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాడు. ఈ విషయంలో ధనుష్ నిర్మాణ సంస్థ 'వండబార్ ఫిల్మ్స్' నష్టపరిహారం డిమాండ్ చేసింది. ఈ వివాదం సినిమా ఇండస్ట్రీలో పెను సంచలనం సృష్టించింది. ధనుష్, నయనతార ఇద్దరు భారతీయ చలనచిత్ర స్టార్ నటులు. కొన్ని దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో ఉన్నారు. ఇద్దరికీ ఫ్యాన్ బేస్ ఉంది. అలాంటిది ఇద్దరి మధ్య గొడవలు రావడం అందరినీ షాక్ కు గురి చేసింది. నయనతార డాక్యుమెంటరీపై ధనుష్ కోర్టులో కాపీరైట్ పిటిషన్ దాఖలు చేశారు. తన అనుమతి లేకుండా ఇలా చేయడం సరికాదని ధనుష్ రూ. 10 కోట్ల నష్ట పరిహారం కోరుతూ నయన తారకు లీగల్ నోటీసులు పంపించారు. దీనిపై స్పందించిన నయనతార ధనుష్ ను విమర్శిస్తూ బహిరంగ లేఖ రిలీజ్ చేయడంతో ఈ వివాదం మరింత ముదిరిపోయింది. ఇప్పుడీ విషయంలో ధనుష్ కు అనుకూలంగా కోర్టు తీర్పు వెలువరించింది. మరి దీనిపై నయనతార ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.





# అఖండ-2 నుంచి ప్రగ్యా జైస్వాల్ అవుట్

ఇక మ్యాటర్ ఏంటంటే.. ఈ సినిమా నుంచి ప్రగ్యా జైస్వాల్ తప్పుకుంది. ఆమె స్థానంలోకి సంయుక్త మీనన్ వచ్చింది. ఈ మధ్యే బాలయ్యతో కలిసి ఓ గోల్డ్ యాడ్ చేసింది సంయుక్త. అలాగే ఆయనతో కలిసి ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు కూడా వచ్చింది. బహుశా ఆ పరిచయంతోనే అఖండ 2 హీరోయిన్ రేసులో సంయుక్త ముందుంది. అయితే సంయుక్త రావడం వరకు ఓకే కానీ బాలయ్యతో ఇప్పటికే రెండు సినిమాలు చేసిన ప్రగ్యా జైస్వాల్ ఈ సినిమా నుంచి తప్పుకోవడమే అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పటికే అఖండతో పాటు మొన్నొచ్చిన డాకు మహారాజ్‌లోనూ ప్రగ్యా నటించింది. బాలయ్యతో ఈమెది బ్లాక్‌బస్టర్ జోడీ కూడా. ఇంత రిలేషన్ ఉన్నా ఎందుకు సినిమా నుంచి తప్పుకుంది అనేది అర్థం కాని విషయం చాలా మందికి. అసలు ఈమె తప్పుకుందా లేదంటే తప్పించారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే తనకు తానుగా అఖండ 2 నుంచి ప్రగ్య బయటికి వచ్చిందని తెలుస్తుంది.

# తొలిసారి సీనియర్ హీరోతో మాళవిక

సోషల్ మీడియాలో ఎప్పటికపుడు కొత్త కొత్తగా ట్రెండీ లుక్‌లో మెరిసిపోతూ అభిమానులు, ఫాలోవర్లకు నిద్రపట్టకుండా చేస్తుంది మలబారు సోయగం మాళవిక మోహనన్. ఈ బ్యూటీ ప్రస్తుతం గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తుందని తెలిసిందే. తొలిసారి తెలుగులో నటిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. తాజాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ బ్యూటీ కెరీర్‌లో తొలిసారి ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేసేందుకు రెడీ అయింది. మాళవిక మోహనన్ మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్‌లాల్ హృదయపూర్వంలో హీరోయిన్‌గా ఫైనల్ అయిందని ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. మాళవిక మోహనన్ ఓ సీనియర్ హీరోతో రొమాన్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని సత్యన్ అంథిక్కడ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో సంగీత, సిద్దిఖీ, సంగీత్ ప్రతాప్, నిషాన్, లలు అలెక్స్, జనార్ధనన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 10 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.



# స్టార్ హీరోతో పూజాహెగ్డె లిప్‌లాక్

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు ప్రస్తుతం బ్యాడ్ లక్ నడుస్తుంది. ఈ అమ్మడు చేసిన సినిమాలని వరుసగా డిజాస్టర్ గా నిలిచాయి. సినిమాలు ఫ్లాప్ అయ్యాయి కానీ పూజా క్రేజ్ మాత్రం అక్కడా తగ్గలేదు. తెలుగులో తక్కువ సమయంలోనే తోపు హీరోయిన్ గా మారింది ఈ పొడుగుకాళ్ల సుందరి. నాగ చైతన్య ఒక లైలా కోసం సినిమాతో మొదలు పెట్టి చివరిగా వచ్చిన రాదే శ్యామ్ సినిమా వరకు ఈ అమ్మడు తన నటనతో అందంతో కవ్వించింది. కాగా ఈ అమ్మడు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది. అయితే గతకొంతకాలంగా ఈ అమ్మడికి కాలం కలిసి రావడం లేదు. చేసిన సినిమాలన్నీ దారుణంగా నిరాశపరిచాయి. ఒక్క భాషలో కాదు ఆమె నటించిన అన్ని బాషల సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. దాంతో ఈ అమ్మడికి అవకాశాలు తగ్గాయి. ఇప్పుడు యంగ్ బ్యూటీస్ క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్నారు. దాంతో ఇప్పుడు పూజా కూడా స్పీడ్ పెంచాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తమిళ్ లో ఓ సినిమా హిందీలో ఓ సినిమాను లైనప్ చేసింది. అంతేకాదు ఈసారి డోస్ పెంచి తన అందంతో ప్రేక్షకులను కట్టిపడేయడానికి రెడీ అవుతుంది. ఇప్పటికే ఈ అమ్మడు తన గ్లామర్ తో కురాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది. కాగా ఇప్పుడు ఓ రొమాంటిక్ సినిమాలో రెచ్చిపోయిందని తెలుస్తుంది. పూజగా తమిళ్ లో దళపతి విజయ్ సరసన ఓ సినిమా చేస్తుంది. అలాగే హిందీలో షాహిద్ కపూర్ తో కలిసి ఓ సినిమా చేస్తుంది. దేవా అనే టైటిల్ తో వస్తున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో పూజా రొమాంటిక్స్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందని తెలుస్తుంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమాలో రొమాంటిక్ సీన్స్, బోల్డ్ డైలాగ్స్, అసభ్యకరమైన సన్నివేశాలు ఉండటం పై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో లిప్ లాక్స్ కు కొదవే లేదు అని తెలుస్తుంది. సినిమాలో మొత్తంగా ఆరు లిప్ లాక్స్ ఉంటాయని తెలుస్తుంది. అంతే కాదు షాహిద్ కపూర్– పూజాహెగ్డే మధ్య ఈ లిప్ లాక్ సీన్ ఓ రేంజ్ లో ఉండటంతో ఆ సీన్ ను సెన్సార్ బోర్డు తొలగించాలని సూచిందని తెలుస్తుంది. మొత్తానికి పూజా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించిందట. మరి ఈ సినిమా పూజకు ఎలాంటి హిట్ ఇస్తుందో చూడాలి.



# గల్లంతయిన అజయ్ మృతదేహం లభ్యం

● హుస్సేన్ సాగర్‌లో గాలింపులో గుర్తించిన పోలీసులు



**హైదరాబాద్,జనవరి28(వెలుతురు):**
హుస్సేన్ సాగర్‌లో గల్లంతయిన యువకుడి మృతదేహం దొరికింది. గాలింపులో పోలీసలు అతడి మృతదేహాన్ని బయటకు తీసారు. భారతమాతకు మహాహారతి కార్యక్రమం ముగింపు సందర్భంగా హుస్సేన్‌సాగర్‌లో గల్లంతైన యువకుడి మృత దేహం లభ్యమైంది. ఆదివారం రాత్రి హుస్సేన్‌సాగర్‌లో బాణసంచా కాల్చేటప్పుడు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సిల్వేరు అజయ్(21) ఆచూకీ దొరకలేదు. అజయ్.. గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే చదువుకునే సాయి సందీప్, రాఘవేంద్ర అతడి మిత్రులు. రాఘవేంద్ర గతంలో టపాసులు కొనుగోలు చేసినప్పుడు మణికంఠ అనే వ్యాపారికి డబ్బులు ఇవ్వలేదు. ఆ సొమ్ము ఇచ్చేందుకు మణికంఠకు ఫోన్ చేయగా, ఆయన భారత్ మాతకు మహాహారతి కార్యక్రమంలో బాణసంచా కాల్చేందుకు హుస్సేన్‌సాగర్ వచ్చినట్లు చెప్పాడు. దాంతో అజయ్‌కి చెందిన బైక్‌పై ముగ్గురూ అక్కడికి వెళ్లారు. డబ్బులు ఇచ్చి మణికంఠతో పాటు సాగర్‌లోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తున్న సమయంలో ప్రమాదం జరిగి బోటులో ఉన్న అందరూ చెల్లాచెదురయ్యారు. గాయపడిన సాయి సందీప్, రాఘవేంద్ర అర్ధరాత్రి 2 గంటల సమయంలో గాంధీ ఆసుపత్రిలో కలుసుకున్నారు. అజయ్ జాడ తెలియకపోవడంతో పోలీసులు, తల్లిదండ్రులు జానకిరామ్, నాగలక్ష్మికి చెప్పగా.. వారు రాత్రి 3.30 గంటలకు సచివాలయ లేక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం రంగంలోకి దిగిన పోలీసులు, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది ఏడు బోట్లపై సాగర్ నీటిలో గాలింపు చేపట్టారు. 45 గంటలపాటు గాలింపు చేపట్టి మంగళవారం సాయంత్రం ట్యాంక్ బండ్ సమీపంలో అజయ్ మృతదేహాన్ని గుర్తించారు. బాణసంచా పేలుస్తుండగా జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణపతి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# మైనర్ బాలికలపై నలుగురు యువకులు అత్యాచారం

**హైదరాబాద్,జనవరి28(వెలుతురు):**
14 ఏళ్ల మైనర్ లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది. న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరపు న్యాయవాదులు క్రాస్ ఎక్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది. ఘటన అనంతరం బాధిత బాలికను వివాహం చేసుకునేందుకు నిందితులు సిద్ధ పడ్డారు. కానీ బాలిక న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించి నిందితులకు శిక్ష పడేలా పోరాటం చేసిందని పోలీసులు తెలిపారు.

# వాతావరణంలో మార్పులు

**సంగారెడ్డి జిల్లా,జనవరి28(వెలుతురు):**
హైదరాబాద్‌లో సగటు ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ పరిధిలో ఉంటాయి. అయితే, ఇటీవల జనవరి మధ్యకాలం నుంచి వీటిలో గణనీయమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, జనవరిలో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. ఏప్రిల్ నాటికి ఉష్ణోగ్రత 36-34 డిగ్రీల మధ్యకు చేరుకుంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. గడిచిన 5 సంవత్సరాలతో పోలిస్తే ఫిబ్రవరిలో వచ్చిన వాతావరణ మార్పులు చాలా క్లిష్టంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జనవరిలోనే హైదరాబాద్ చల్లగా ఉంటుంది. ప్రతి ఏడాది జనవరిలో సగటున ఉష్ణోగ్రతలు 15.6 నుండి 28.5 వరకు నమోదు అవుతాయి. 2022లో జనవరిలో 12లో సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. 2020 లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి. ఒక 2015 జనవరిలో మాత్రం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సంవత్సరం వాతావరణ మార్పులు ప్రకృతిపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని తెలుస్తోంది. ముఖ్యంగా, హైదరాబాదులో విపరీతమైన వేడిగాలులు, వర్షాలు కనిపించవచ్చు. వాతావరణ మార్పులతో పర్యావరణం, పై నా ప్రతికూల ప్రభావం పడనుంది. .పర్యావరణ నిపుణులు గమనించిన విధంగా, క్లైమేట్ మార్పుల వల్ల హైదరాబాద్ వంటి నగరాల్లో కాలుష్యం అధికమవుతోంది. ఇది ప్రజలలో శ్వాస సంబంధిత వ్యాధులు ఎక్కువ అవ్వడానికి కారణమవుతోంది. కాగా ఫిబ్రవరి 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ సంచాలకులు నాగరత్నమ్మ తెలిపారు. ఒక్కొక్కప్పుడు చల్లగాలులు, మరొక్కప్పుడు వేడిగాలులు వీస్తాయన్నారామె. ఇక ఫిబ్రవరి 15 తర్వాత వేడి తీవ్రత పెరుగుతుందని, నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు.

# జనాభా పెంపుదల ఎవరికోసం?

**అమరావతి,జనవరి28(వెలుతురు):**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య రాష్ట్రంలో పెద్ద ఎత్తున జనాభా పెంచాలని ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌లో కూడా దీనిని ఒక ప్రధాన అంశంగా పొందుపరిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే..గతంలో జనాభా నియంత్రణలో భాగంగా తీసుకొచ్చిన..ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత లేదనే చట్టాన్ని రద్దు చేశారు. ఇప్పుడు కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పిస్తూ త్వరలో చట్టం తేబోతున్నట్లు కూడా ప్రకటించారు. ఇకపై ఏ పథకం అమలు చేయాలన్నా కుటుంబ పరిమాణాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని, ఇకపై జనాభా పెంచేందుకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్రంలో జనాభా పెంచాల్సిన అవసరాన్ని ప్రతిపాదిస్తూ దానికిగల కారణాలను కూడా తెలియజేస్తున్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే ఆర్థికంగా అభివృద్ధి చెందిన సంపన్న దేశంగా మారుతుందని, అలాగే ఆంధ్ర రాష్ట్రం కూడా 2.41 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు చేరి దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన రాష్ట్రంగా మారుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో జనాభా పెరుగుదల తగ్గే ప్రమాదం కనిపిస్తున్నదని ఇది ప్రమాదకరమని సూత్రీకరించారు. నేడు రాష్ట్ర జనాభా 5.38 కోట్లుగా ఉండగా 2031లో అది 5.42 కోట్లకు, 2036కి 5.44 కోట్లకు చేరి 2051కి 5.41 కోట్లకు పడిపోతుందని అంచనా వేశారు. 2026లో ఒక జంట సగటున 1.51 మందికి జన్మనిస్తే 2051 నాటికి 1.07కి తగ్గిపోతుందని, ఇది ప్రమాదకరమని కనుక ఒక జంటకు సగటున 2.1 మంది పిల్లలు జన్మిస్తేనే జనాభా స్థిరంగా కొనసాగటం సాధ్యమవుతుందని అంటున్నారు. ఈ అంచనాల ఆధారంగా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జనాభాను పెంచాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నారు. ముఖ్యంగా జనాభా పెంచడం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలో పెద్దయెత్తున యుక్త వయస్సు కలిగిన జనాభాగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవిస్తుందని, ఈ అవకాశాన్ని రాష్ట్రం ఉపయోగించుకొని ప్రతి కుటుంబం సుసంపన్నం అవుతుందనే వాదనను ముందుకు తెచ్చారు.చంద్రబాబు నాయుడు 2050 నాటికి యువ జనాభా కలిగి ఉండటం వల్ల వచ్చే ప్రయోజనాల గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారు. కాని నేడు ప్రపంచంలో అత్యంత యువ జనాభా కలిగిన దేశంగా భారత్ ఉంది. దేశ జనాభా ప్రస్తుత మధ్యస్థ వయస్సు 29.5 శాతంగా వుంది. యువత రూపంలోనేగాక పరిమాణంలో కూడా ఎక్కువ కోట్ల మంది యువ జనాభాను కలిగిన దేశం ప్రపంచంలో మరొకటి లేదు. 1991లో 15-59 వయస్సు మధ్య వున్న జనాభా 55.4 శాతం ఉండగా నేడు 65 శాతానికి పెరిగింది. ఈ వయస్సుల మధ్య వున్న జనాభానే పని చేయటానికి అందుబాటులో వున్న శ్రామిక జనాభాగా పరిగణిస్తారు. నేడు ఇంత పెద్ద సంఖ్యలో అందుబాటులో వున్న శ్రామిక జనాభా ప్రపంచంలో మరే దేశంలో లేరు. అలాగే ప్రతి ఏడాది 25 ఏళ్ల లోపు వయస్సు వున్న యువత 2 కోట్లకు పైగా శ్రామిక మార్కెట్ లోకి వస్తున్నారు. ఈ జనాభాను ఎందుకు ఉపయోగించు కోవడంలేదు? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పటంలేదు. చెప్పలేరు కూడా? ఎందుకంటే వీరు అనుసరిస్తున్న విధానాలే దీనికి ముఖ్య కారణం. అందువల్లే 65 శాతం శ్రమ చేసే జనాభా దేశం కలిగివున్నా, కేవలం 45.2 శాతం మాత్రమే వినియోగించుకోగలుగుతున్నది. పట్టణ ప్రాంత మహిళా శ్రామికులలో ఇది 23.4 శాతం గానే వుంది. ఏ దేశమైనా శక్తివంతమైన జనాభా కలిగి ఉందనే దానికి రెండు ముఖ్యమైన సూచికలను పరిగణలోకి తీసుకుంటారు. ఆ జనాభాకి విద్య, వైద్య సదుపాయాలు, అవి అందుబాటులో ఉన్న తీరు, వాటి నిర్వహణలో ప్రభుత్వ పాత్ర కీలకమైనవిగా ఉంటాయి. ప్రపంచ దేశాలతో పోలిస్తే వీటిల్లో నేడు భారత



దేశం, ఆంధ్ర రాష్ట్రం అత్యంత అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్ర అక్షరాస్యత చూస్తే నేటికీ 72 శాతం మాత్రమే. మహిళా అక్షరాస్యతలో ఆంధ్ర రాష్ట్రం దేశంలో 35వ ర్యాంకుతో అట్టడుగున వుంది. విద్యా నమోదు నిష్పత్తి, చదువు నుండి మధ్యంతరంగా వైదొలగడం దారుణంగా ఉన్నాయి. పదవ తరగతి లోపున 16.3 శాతం విద్యార్థులు చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఇంటర్ స్థాయికి వచ్చేసరికి 56.7 శాతానికే పరిమితం అవుతున్నారు. ఉన్నత విద్యకి వచ్చే సరికి అది 36.5 శాతానికి పడిపోయింది. పదేపదే నైపుణ్యం గురించి చంద్రబాబు మాట్లాడుతున్నారు. వృత్తి నైపుణ్యంలో చైనా తన జనాభాలో 60 శాతం మందిని కలిగి వుంటే, అదే భారతదేశం కేవలం రెండు శాతం, ఆంధ్ర రాష్ట్రం ఒక శాతంలోనే వున్నాయి. ఇక ఆరోగ్య సూచికలు చూస్తే స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ళు దాటినా ఆందోళనకరంగానే ఉన్నాయి. జీవిత కాలపు సగటు వయస్సు రాష్ట్రంలో నేటికీ 70 ఏళ్ళు దాటలేదు. తీవ్ర రక్తహీనతతో బాధపడే మహిళలు 50.5 శాతం ఉన్నారు. అదే వయస్సుకు తగ్గ బరువు లేనివారు 36 శాతం ఉండగా ప్రసూతి మరణాలు 65, సమతుల్య పోషకాహారం తీసుకోలేని వారు 56 శాతం నేటికీ ఉన్నారు. అలాగే అంటువ్యాధులు ప్రబలి ప్రజలను ఎలా బలి తీసుకుంటున్నాయో చూస్తున్నాం. నయా ఉదారవాద విధానాల అమలు ప్రారంభమైన తర్వాత దేశంలో ఈ విధానాలకు ఎక్కువ ప్రభావానికి గురైంది విద్యా, వైద్య రంగం. అందులో ఆంధ్ర రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ప్రైవేటు రంగాన్ని విస్తరించి లాభాల సరుకులుగా మార్చేశారు. ప్రభుత్వ పెట్టుబడుల కల్పన, ప్రభుత్వ జోక్యాన్ని ఈ రంగాల్లో దెబ్బ తీశారు. ఈ పరిణామాలు సమాజాన్ని రెండుగా విభజిస్తున్నాయి. ఉన్నత సదుపాయాలు, సేవలు కేవలం కొద్ది మందికే ఈ రంగంలో పరిమితం కాగా, అత్యధిక మంది నాణ్యత లేని సేవలకే పరిమితం అయ్యారు. ఆరోగ్య సంరక్షణపై ఖర్చు పెట్టలేని వారి సంఖ్య పెరిగిపోతూ వయస్సు పైబడుతున్న వారు పెద్ద ఎత్తున అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. తగిన ఆదాయాలు లేకపోవడంతో కుటుంబాల్లో భారమైన వ్యక్తుల సంఖ్య పెరుగుతున్నది. అలాగే అతి తక్కువ మంది యువతను నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా సృష్టిస్తూ అత్యధిక మందిని నైపుణ్యం లేని వారిగా మార్చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశం యువత ప్రపంచంలో ఏర్పడే అనేక నూతన అవకాశాలను కూడా అందిపుచ్చుకోలేక పోతున్నారు. వీటిని సరి చేయకుండా, విద్యా వైద్య రంగాలను ప్రభుత్వ పెట్టుబడులతో శక్తివంతమైనవిగా చేయకుండా పని చేసే వయస్సు కలిగిన వారి సంఖ్య పెరిగినా దేశ, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పుడు విజన్ 2047లో ఈ రంగాలను పూర్తిగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పి 4) పేరుతో ప్రైవేట్ శక్తుల పరం చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో యువ జనాభా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున నిరుద్యోగానికి, దోపిడికి గురవుతారనేది వాస్తవం.వాస్తవంగా ఈ కాలంలో యువతరం సంసార సాగరం ఈదేందుకు వెనుకాడుతున్నది. ఇది జనాభా క్షీణతకు దారితీస్తుంది. ఫలితంగా యువ శ్రామిక శక్తి గణనీయంగా తగ్గిపోతున్నది. పెళ్లి చేసుకొని పిల్లలను కనటానికి ముందుకు రావడం లేదు. సరైన ఉపాధి వేతనాలు లేకపోవడం, పెరుగుతున్న ఖర్చులను భరించలేకపోవటం, పిల్లలు ఆరోగ్య సంరక్షణ, చదువుల ఖర్చులు భరించలేనివిగా ఉండటం వీటన్నిటి వల్ల యువత పిల్లలను వెంటనే కనేందుకు ఉత్సుకత చూపటంలేదు. అలాగే కొందరు ఉపాధి దొరక్క పెళ్లిళ్లు చేసుకోవడం కూడా వాయిదా వేసుకుంటున్నారని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయి. ఇవన్నీ పాలకులు కోరుకుంటున్న వ్యవస్థ దుష్ఫలితాలే. మరొక వాదనను కూడా చంద్రబాబు ముందుకు తీసుకొస్తున్నారు. స్థూల ఆర్థిక వృద్ధి రేటు బాగా పెంచటం ద్వారా పెద్ద యెత్తున ఉపాధి అవకాశాలు వస్తాయని, అవి అందుపుచ్చుకునే యువ కార్మిక శక్తి ఉండాలని అంటున్నారు. ఈ వృద్ధి ద్వారా సృష్టించే సంపద వల్ల పేదరికం, నిరుద్యోగం, అసమానతలు అన్నీ తొలిగి రాష్ట్ర జనాభా అత్యంత సంపన్నమైనదిగా మారుతుందని వాదిస్తున్నారు. వాస్తవంగా నయా ఉదారవాద విధానాల కాలంలో అంతక ముందు కన్నా దేశ వృద్ధి రేటు ఎక్కువగా కొనసాగుతున్నది. ఆంధ్ర రాష్ట్రంలో కూడా 10 శాతం పైనే గత దశాబ్దంలో కొనసాగింది. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం, పేదరికం అసమానతలు పెరిగాయి. దేశంలో ఉపాధి అవకాశాల పెరుగుదల లేకపోవడం ఒక ప్రధాన ధోరణిగా కొనసాగుతున్నదనేది వాస్తవం. యుక్త వయస్సు వచ్చి ఉపాధి కోరుకుంటున్న వారి సంఖ్య ఏ మోతాదులో ప్రతిఏడాది పెరుగుతుందో కనీసం ఆ స్థాయిలో కూడా ఉపాధి అవకాశాలు పెరగడంలేదు. కనుక జిడిపి, వృద్ధిరేటు పెరిగినంత మాత్రాన ఉపాధి అవకాశాలు వాటంతటవే పెరగటం లేదనేది గత మూడు దశాబ్దాల అనుభవం. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతు ఉపసంహరణతో ఇవి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. నయా ఉదారవాద కాలంలో ఉపాధి రంగంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. శాశ్వత ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులు పెరుగుతున్నారు. ఉద్యోగ భద్రత లేని వారి సంఖ్య పెరుగుతున్నది. వేతనాలు అత్యంత ఘోరంగా ఉన్నాయి. అసంఘటిత రంగం పెరుగుతున్నది. పారిశ్రామిక కార్మికుల్లో పెరుగుదలలేదు. వ్యవసాయ రంగంలో వేతన ఉపాధి పడిపోతున్నది. కార్మిక చట్టాల్లో మార్పులు కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకువస్తున్నారు. వ్యవసాయ శ్రామికుల నిజవేతనాలు స్థంభించిపోయాయి. శ్రమ దోపిడి పెరిగింది. సంపద పోగుపడుతూ పెద్ద ఎత్తున సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. కనుక చంద్రబాబు నాయుడు తెర మీదకు తెచ్చిన జనాభా సిద్ధాంతం పెట్టుబడిదారుల దోపిడికి, వారి సంపద పోగు చేసుకోవడానికి దోహదం చేసేది తప్ప రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం మేలు చేసేది కాదు. అలాగే పెట్టుబడిదారుల దోపిడిని కప్పిపుచ్చే ప్రచారం ఇది. అలాగే నేడు ప్రజలు ఎదుర్కొనే సమస్యలను కూడా పక్కదారి పట్టించేది.

# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

● ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

**సంగారెడ్డి జిల్లా,జనవరి28(వెలుతురు):**
హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహారీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై



బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పూర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్లు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com